

హత్యకు గురైన బాలిక

పాపం.. ఏం చేసిందని!

- తెలిసినవాడిగా ఇంట్లో చేరిక
- కొన్నాళ్లుగా నగదు, బంగారంపై కన్ను
- చోరీని బాలిక గమనించడంతో హత్య
- పోలీసులకు పట్టించిన అతి ప్రవర్తన

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు



సిర్రా రంజిత(ఫైల్ ఫొటో)

ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో కూడా తెలియడం లేదు.. నమ్మితే నట్టేట ముంచేసే వాళ్లు.. మన చుట్టూనే తిరుగుతున్నారు.. రామచంద్రపురంలో ఇదే జరిగింది.. ఇంట్లో నమ్మకంగాఉన్న వ్యక్తి పాపం.. ఏంచేసిందని.. ఏం చూసిందనేది ఆలోచించకుండా పదేళ్ల చిన్నారిని పొట్టన పెట్టుకున్నాడో క్రూరుడు.. చున్నీని బాలిక మెడకు చుట్టి.. ఆమెను మంచంపైకి తోసి ముఖాన్ని నొక్కి అదిమిపట్టి హత్యచేశాడు. తనపై ఎవరికీ అనుమానం రాకుండా బాలిక మృతదేహాన్ని ఫ్యాన్‌కు ఉరితీసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఇదంతా చేసిందెవరో తెలిసి పోలీసులే అవాక్కయ్యారు. ఆ కుటుంబానికి పరిచయమున్న వ్యక్తి.. బాలిక తల్లిని అక్కా అని పిలిచేవాడే ఈ పాపానికి ఒడిగట్టాడు.. రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన పెయ్యల శ్రీనివాస్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. బాలిక తల్లిదండ్రులకు తొలుత అలాగే పరిచమయ్యాడు. ఇంట్లో ఎలక్ట్రికల్ సమస్య ఏదున్నా అతనికే చెప్పేవారు. వచ్చి చేసి వెళ్లిపోయేవాడు. ఆ ఇంట్లో సొంతవాడిలా మెలుగుతున్నాడు.. ఏ పని ఉన్నా వాడికే ఫోన్ చేసేలా మారిపోయాడు. అలా ఆనుపానులు చూసుకున్నాడు. బంగారం, డబ్బు దొంగిలించాలన్న దుర్బుద్ధితో ఈనెల 4న ఆ ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో ఉన్న చిన్నారి తన చోరీ యత్నాన్ని పసిగట్టిందన్న భయంతో కర్కశంగా చంపేశాడు. బాలిక మృతదేహం పక్కనే నిలబడి కన్నీటి పర్యంతమయ్యాడు. తన నట విశ్వరూపం చూపాడు. బాలిక మృతికి తాను బాధపడుతున్నట్టుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. బాలిక మరణించిన తర్వాత రోజు తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతుంటే వారి పక్కనే ఉన్నాడు. ఎక్కడా ఎవరికీ చిక్కకుండా తప్పించుకున్న నిందితుడు అతి ప్రవర్తనతో పోలీసులకు దొరికిపోయాడు. అంతే అతడి పాపం పండిపోయింది.. పెయ్యల శ్రీనివాస్‌ను తొలుత పోలీసులు నిందితుడిగా అనుమానించలేదు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరిస్తుండగా వారితో అతిగా ప్రవర్తించినట్టు సమాచారం. దీంతో క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్‌కు అనుమానం వచ్చి అతడి వేలిముద్రలు తీసుకున్నారు. అదే దర్యాప్తులో కీలకంగా మారింది. శ్రీనివాస్ వేలిముద్రలు సరిపోవడంతో ఆదివారం పోలీసులు దీన్ని హత్యగా తేల్చారు. తల్లి లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించి.. బాలికను హత్య చేసి ఏమీ తెలియనట్టుగా ఉరివేసి వెళ్లిపోయాడని తేల్చారు. ఇది తెలియడంతో బాలిక తల్లిదండ్రులు ఘొల్లుమన్నారు. పాపను ఇలా చంపేస్తాడనుకోలేదని కన్నీటి పర్యంతమయ్యారు. వాడిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హత్యకేసును నాలుగురోజుల్లో చేధించిన డీఎస్పీ రఘువీర్, సీఐలు నారాయణ, దొరరాజు, ఎస్‌ఐలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, జానీభాషా, సురేష్‌బాబు, అంగర హరీష్‌లతోపాటు ఫింగర్ ప్రింట్ బ్యూరో అమలాపురం ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, వారి బృందం సభ్యులను జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా అభినందించారు.

- ద్రాక్షారామ(రామచంద్రపురం)-ఆంధ్రజ్యోతి

పూర్తి వివరాలు మెయిన్‌లో..

ఆపేదెవరు.. భైరవా..

భౌబోయ్.. బతకనివ్వడంలేదు!





ఎక్కడపడితే అక్కడ కుక్కలు.. అందుగలవు.. ఇందులేవని సందేహం వలదు.. ఎటు చూసినా కుక్కలే.. ఏ వీధి చూసినా కుక్కల గుంపులే.. ఎంతలా అంటే ఏ వీధిలో అడుగుపెట్టాలన్నా భయపడేంతగా కుక్కలు పెరిగిపోయాయి.. బడి..గుడి.. ఆసుపత్రి.. బస్టాండ్.. రైల్వే స్టేషన్..క్రీడాప్రాంగణాలు ఎక్కడ చూసినా అవే.. జనసమ్మర్ద ప్రాంతాల్లో కుక్కలు కనబడకూడదని సాక్షాత్తూ సుప్రీం కోర్టు ఆదేశించినా తీరులో మార్పేమి లేదు.. అవి యథేచ్ఛగా తిరుగుతూనే ఉన్నాయి.. అధికారులు చూస్తూనే ఉన్నారు.. కుక్కలు తరుముతుంటే జనం బౌబోయ్ అంటూ పరుగులు పెడుతున్నారు.. ఇకనైనా అధికా రులు దృష్టి పెట్టి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాల్సిందే మరి..

- (రాజమహేంద్రవరం/ కాకినాడ/ అమలాపురం రూరల్- ఆంధ్రజ్యోతి)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పట్టణం,గ్రామం అనే తేడా లేకుండా రాత్రి వేళ అధికారులను ఏ వీధిలోకి పంపించినా కుక్కలకు బంధీ లవు తారు. వీధుల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు జనం పిక్కలు లాగేయడానికి సిద్ధంగా ఉంటున్నాయి. అవి దయతలిస్తేనే రోడ్డుపై జనం సంచరించే పరిస్థితు లు ఉన్నాయంటే అబద్ధం కాదు. కుక్క కరవకుండా ఇంటికి చేరుకున్నామంటే అదృష్టంగానే భావించాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.పిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు.రాజమండ్రి రైల్వేస్టేషనల్లో కుక్కలను తప్పించుకొని వెళ్లే కంగారులో ప్రమాదాలు జరుగు తున్నాయి.పిల్లల చేతిలో ఏమైనా తిను బండారాలు ఉంటే వాటిపైకి ఇసురుగా వచ్చి లాక్కోవడంతో పాటు పిల్లలపై దాడి చేయడానికి యత్నిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం కన్నెర్ర చేసే వరకూ పరిస్థితి వెళ్లింది.ఇప్పటికైనా భౌబోయ్ భయం తగ్గుతుందేమో అని జనం చర్చించుకుంటున్నారు.

- ఉమ్మడి జిల్లాలో లక్షకుపైనే గ్రామ సింహాలు
- పెరిగిపోతున్న కుక్కల సంతతి
- ఆసుపత్రులకు కుక్క కాటు బాధితుల క్యూ
- తూతూ మంత్రంగా ఏబీసీ ఆపరేషన్లు
- సుప్రీం కోర్టు ఆదేశించినా కానరాని కదలిక

పెంచేసిన..కరోనా

కరోనా విపత్తు 2019, 2020,2021, 2022లో ఏబీసీ ఆపేయడంతో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు.2023, 2024లో ఆ సంఖ్యను అదుపులోకి తీసుకురావడానికి సీరియస్‌గా యాక్షన్‌లోకి దిగలేదు. పంచాయతీల్లో ఏబీసీలు లేకపో వడంతో ఆయా ప్రాంతాల్లోని కుక్కలను తీసుకొచ్చి నగర శివార్లలో వదిలేస్తున్నారు. కుక్కలకు డిసెంబరు, జనవరి నెలల్లో బ్రీడింగ్ సమయం. ఒక్కో కుక్కకు ఒక ఈతలో 4 నుంచి 8 పిల్లలు పుడుతుంటాయి.

సుప్రీం ఆదేశాలు అమలయ్యేనా?

వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అలాగే ఏబీసీ తర్వాత మళ్లీ అదే ప్రాంతంలో వదలొద్దని ఆదేశించింది. కానీ ఈ రెండిటిపై కార్యాచరణ ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటి వరకూ జిల్లాలో కుక్కల షెల్టర్లు లేవు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఏబీసీ తర్వాత ఎక్కడ వదిలి పెట్టాలనే అంశం కూడా కీలకం కానుంది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా ప్రాంగణాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, జన సమ్మర్ద ప్రాం తాల్లో వీధి కుక్కల జాడ ఉండడానికి వీల్లేదని సుప్రీం చెప్పింది. విద్యా సంస్థల వద్ద కుక్కలు రాకుండా ఏర్పాట్లు ఉన్నా.. మిగతా చోట్ల నియం త్రించడంపై చిత్తశుద్ధి అవసరంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించడం చాలా కష్టమనే ప్రచారం సాగుతోంది. వీధికుక్కలను పట్టుకుని ఒక చోట చేర్చడం ఓ పెద్ద ప్రహసనమే అంటున్నారు. అన్ని కుక్కల ఆలనాపాలనా చూ డాలంటే తలకుమించిన భారమవుతోందని చెబుతు న్నారు.ఈ క్రమంలో సుప్రీం ఆదేశాలపై అధికారులు కార్యాచరణ రూపొందించాల్సి ఉంది.



ఏబీసీ పని చేస్తోందా!

కుక్కల సంఖ్య నియంత్రణకు యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) శస్త్రచికిత్సలు చేస్తుంటారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో రోజుకు ప్రస్తుతం 25 వరకూ ఏబీసీ చేస్తున్నామని చెబుతున్నారు.ఒక్కో కుక్కకు రూ.1500 చొప్పున కార్పొరేషన్ ఖర్చుచేస్తోంది. కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు రాజమహేంద్రవరం కార్పొ రేషన్‌కే పరిమితమైంది. దీని పైనా పర్యవేక్షణ లేదు..ఏ రోజు ఏం చేశారనే నిఘా లేదు. కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో పట్టిం చుకోవడం లేదు. పంచాయతీల్లో ఏబీసీ చేయ డానికి నిధుల కేటాయింపు లేదు.ఏబీసీ ఆప రేషన్ చేసినా కొన్నింటికి ఫెయిలవుతున్నాయనే వాదన ఉంది. కాకి నాడ,కోనసీమలో ప్రైవేటుగా చేయిస్తున్నట్టు సమాచారం.

వెటర్నరీ చతికిల

జిల్లా వ్యాప్తంగా వెటర్నరీ ఉన్న ఆస్పత్రుల్లో సర్జరీలకు పరికరాలు అందుబాటులో ఉంటాయి. వెటర్నరీ డిస్పెన్సరీలు ఉంటాయి. ఎక్కడా వెటర్నరీ శాఖ ఏబీసీపై దృష్టి సారించడం లేదు.దీంతో పంచాయతీల్లో కుక్కల సంతతి విపరీతంగా వృద్ధి చెందుతోంది. గతంలో కలెక్టర్ ఆదేశాలతో రాజమహేంద్రవరం వెటర్నరీ ఆస్పత్రిలో ప్రతి ఆదివారం వీధి కుక్కలకు ఏబీసీ చేసేవారు. నిలిపివేశారు ఎందుకో మరి..

తూర్పున 50 వేలు..

తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 50 వేల గ్రామ సింహాలు ఉన్నట్టు అంచనా.రాజమహేంద్రవరం సిటీ పరిధిలోనే తక్కువలో తక్కువంటే 15 వేలు ఉంటాయి. శంభూనగర్‌లోనే కుక్కల సంఖ్య అధికం. అధికారులు మాత్రం బాగా తక్కువ చేసి చూపే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. రోజుకు కుక్కల నోటికి 100 మంది వరకూ చిక్కుతున్నారు. రాజమహేంద్రవరం సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ సుమారు 50 మంది కుక్క కాటు బాధితులు వస్తున్నారు.చికిత్స పొందుతున్న వాళ్లు మరో 50 మంది ఉంటున్నారు. ఈ లెక్కన రోజుకు 100కి పైగానే జనం కుక్కల బారిన పడుతున్నారు.

కాకినాడలో 37 వేలు

కాకినాడ జిల్లాలో 37 వేలు శునకాలు ఉన్నట్టు అంచనా. వాటిలో 15 వేలు కాకినాడ కార్పొరేషన్‌లోనే ఉన్నాయి.జిల్లాలో 2021లో కుక్క కాటు కేసులు 6031 నమోదు కాగా రేబిస్‌తో ఏడుగురు మృతిచెందారు. 2022లో 6364 కేసులు నమోదైతే ఆరుగురు మృతిచెందారు. 2023లో 4293 కేసులు నమోదైతే ఇద్దరు రేబిస్‌తో మృతి చెందారు.2024లో 5 వేల మంది, 2025లో 4 వేల మంది కుక్కకాటు బారిన పడ్డారు.కాకినాడ అధికారులు ఏబీసీ ఆపరేషన్లు ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా చేయిస్తున్నా సత్ఫలితాలనివ్వడంలేదనే ఆరోపణలున్నాయి.

కోనసీమలో 30 వేలు

కోనసీమ జిల్లాలో పెంపుడు,వీధికుక్కలు 30 వేలు ఉంటాయని చెబుతున్నారు. ఒక్క అమలాపురంలోనే 5 వేలుపైనే వీధి కుక్కలు ఉంటాయని సమాచారం..జిల్లాలోని పీహెచ్‌సీల్లో రోజుకు 40 మంది వరకు కుక్క కాటు బాధితులు వైద్యం చేయించుకుంటున్నారు. జిల్లాలో 4 వేల కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. అమలాపురంలో కుక్కలను పట్టుకునేందుకు కాంట్రాక్టర్‌ను నియమించినట్టు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు.

నేడు అనపర్తికి స్పీకర్ అయ్యన్న రాక



అనపర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం అనపర్తిలో పర్యటిస్తారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం అనపర్తి మండలం పెడపర్తి చేరుకుని గ్రామంలోని పురాతన శివాలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారన్నారు. అనంతరం 12 గంటలకు కుతుకులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి అక్కడ రైతులతో ముచ్చటిస్తారన్నారు. అనంత రం 1గంటకు ఇటీవల అభివృద్ధి చేసిన అనపర్తి అర్తమూరు బీటీ రహదారిని స్పీకర్ ప్రారంభిస్తారన్నారు. స్పీకర్ పర్యటన విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కూటమి నాయకులకు పిలుపునిచ్చారు.



సింహాద్రి అప్పన్న



గెడ్డం సందీప్

రెండు కుటుంబాలకు.. గుండె కోత!

మృత్యువు ఏ రూపంలో ఎటు నుంచి వస్తుందో చెప్పలేం.. రెప్పపాటులో ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.. చిన్నపాటి నిర్లక్ష్యం జీవితాలను బలి తీసుకుంటుంది.. గండేపల్లి మండలంలో ఆదివారం జరిగిన ఘటనే అందుకు నిదర్శనం.. జీవనోపాధి నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం నుంచి వరికోత మిషన్‌ను ఐషర్‌వ్యాన్‌పై తీసుకుని గండేపల్లి వెళ్లారు.. అయితే దారి మధ్యలో వరి కోత మిషన్ విద్యుత్ వైర్లకు తగిలి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు.

7

వరి పంట.. లేదు తంటా

53 కేంద్రాల్లో 3052.4 టన్నుల ధాన్యం కొనుగోలు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి.10 మండలాల్లో..53 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్ప టి వరకూ జిల్లాలో 380 మంది రైతులకు చెందిన రూ.7.23 కోట్లు విలువైన 3052.4 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.95 మంది రైతు లకు సంబంధించిన 810.08 మెట్రిక్ టన్నులకు రూ.1.92 కోట్లు రైతుల ఖాతాలో జమచేశారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో కొంత పెండింగ్ ఉన్నట్టు అధి కారులు చెబుతున్నారు. సోమవారం మిగతా సొమ్ము జమ అవు తుంది.జిల్లావ్యాప్తంగా 19 మండలాల పరిధిలో 212 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 53 కేంద్రాలు ఆరంభమయ్యాయి. రైతులు కోతలు ముమ్మ రం చేస్తే మిగతా కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. కాకినాడ జిల్లా 21 మండలాల పరిధిలో 269 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఒక మండలంలోనే 2 రైతు సేవాకేంద్రాల ద్వారా ఏడుగురు రైతుల నుంచి 44 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రం కొనుగోలు చేశారు. కోనసీమ జిల్లాలో కూడా పరిస్థితి ఇలానే ఉంది.కాకినాడ జిల్లా కంటే కొంత మెరుగు. ఇక్కడ 22 మండ లాల్లో 177 రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం రెండు మండలాల పరిధిలో 6 కొనుగోలు కేంద్రాల్లో 31 మంది రైతుల కు చెందిన 203.28 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. దాని విలువ రూ.48 లక్షలు. కానీ ఇంకా ఏమీ రైతుల ఖాతాలో జమ కాలేదు. ధాన్యం కొనుగోళ్లలో తూర్పు ముందు వరుసలో ఉంది.





నింగి నుంచి నిఘా!

నిర్మానుష ప్రదేశాల్లో డ్రోన్ కన్ను

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో పోలీసులు గట్టి నిఘానే కొనసాగిస్తున్నారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నిఘాను డ్రోన్ల ద్వారా చేస్తున్నారు. అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు జిల్లాలో ప్రశాంత వాతవరణం కల్పించేందుకు పోలీసులు డ్రోన్ల ద్వారా పలు ప్రాంతాలను తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. నిర్మానుష ప్రదేశాల్లో నిశితంగా పరిశీలన చేస్తున్నారు.ఆదివారం కార్తీక వన సమారాధనలు భారీగా ఉండడంతో బహిరంగ ప్రదేశాలు, తోటలు, గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా పెట్టారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. డ్రోన్ కెమెరాలతో నేరాలు జరగకుండా పటిష్టమైన చర్యలను జిల్లా పోలీసులు చేపడుతున్నారు.

లక్ష్యం ఓకే.. బిల్లులు షాకే

గోకులం షెడ్లు బిల్లుల విడుదలలో తీవ్ర జాప్యం



గోకవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లను మంజూరు చేసింది. పశుపోషకులు, కోళ్లు, జీవాల పెంపకందారులకు కొంతమేర రాయితీ కల్పిస్తూ ఒక్కో షెడ్డుకి రూ.1.80 లక్షల నుంచి రూ.2.30 లక్షల నిధులను తొలిసారి జరిగిన ఎంపికలో కేటాయించింది. ప్రస్తుతం కొత్తగా మంజూరు చేస్తున్న షెడ్లకు రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు కేటాయిస్తోంది. జిల్లా వ్యాప్తంగా లక్ష్యం మేరకు పాడి రైతులు అప్పులు తెచ్చి మరీ షెడ్లను నిర్మించారు. విడతల వారీగా బిల్లులు బకాయిలు చెల్లించాల్సి ఉండగా షెడ్లు పూర్తయి నెలలు దాటుతున్నా నిధుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుంది.కొంతమంది లబ్ధిదారులకు కొంతమేర మాత్రమే నిధులు మంజూరయ్యాయి. మిగిలిన బిల్లులకు పాడి రైతులు ఎదురు చూస్తున్నారు.

పాత బిల్లులకు ఎదురుచూపులు

జిల్లాలోని 18 మండలాల్లో సుమారు 675 గోకుల షెడ్లను నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో 570 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పాడి రైతులకు అనుకూల రీతిలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడం, బిల్లులు మంజూరులో జాప్యం జరుగుతుందనే ప్రచారం ఎక్కువగా ఉండడంతో కొందరే నిర్మాణాలకు ముందుకు వచ్చారు. ఇప్పటి వరకు సుమారు రూ.7 కోట్లకు పైగా మేర నిధులు వచ్చాయి. ఇంకా సుమా రు రూ.కోటికి పైగా బిల్లులు పాత లబ్ధిదారులకు మంజూరు కావాల్సి ఉంది. నిర్మాణాలు పూర్తి చేసుకున్న మిగిలిన షెడ్లకు నిధులెప్పుడొస్తాయో.. సగం మాత్రమే మంజూరు చేసిన షెడ్లకు పెండింగ్ బిల్లులు ఎప్పుడు మంజూరు చేస్తారోనని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.తాజాగా మరో 900 షెడ్లు నిర్మాణాలు లక్ష్యం కాగా సుమారు 790 షెడ్లుకు మంజూరు లభించింది.



జాబ్‌మేళా పెట్టారు..ఉద్యోగాలిచ్చారు..

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళను వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మెప్మా పీడీ టి.కనకరాజు అన్నారు. ఆనం కళాకేంద్రంలో ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు హాజరై మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యుల పిల్లలు భవిష్యత్ దృష్ట్యా సీఎం చంద్రబాబు జాబ్ మేళాలు,ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. పలు రంగాలకు చెందిన 18 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. జాబ్‌మేళాలో మొత్తం 2165 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 645 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 239 మందిని ఎంపికయ్యారని తెలిపారు. ఈ జాబ్ మేళలో ఆపరేషన్ మేనేజర్ ఎన్.కార్తీక్, యువత ,మహిళలు పాల్గొన్నారు.

శివయ్యకు జలాభిషేకం





కొవ్వూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లలితా పార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామికి కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సహ్రస ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు, మహిళలు గోష్పాదక్షేత్రంలోని గోదావరి నది నుంచి రాగి బిందెలతో నదీ జలాలను తీసుకుని ఊరేగించారు. శివాలయంలోని గర్భాలయం చుట్టూ గ్లాస్ డోర్‌లతో మూసివేసి గోదావరి నుంచి తీసుకువచ్చిన జలాలతో శివలింగం మునిగే వరకు అభిషేకం చేశారు. అనంతరం మహానీరాజనం సమర్పించారు. అనంతరం భక్తులకు కార్తీకమాసం సందర్భంగా అన్న ప్రసాద (అన్నదానం) వితరణ చేశారు.

'లోవ'లో భక్తుల రద్దీ

రూ.2.43 లక్షల ఆదాయం

తుని రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తిభోజనాలు చేశారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.2.43 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న తలుపులమ్మ


క్యూలో బారులుతీరిన భక్తులు

కిక్కిరిసిన సత్యదేవుడి సన్నిధి

భారీగా తరలివచ్చిన భక్తులు

9వేల వ్రతాలు

రూ.85 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం భక్తజనసందోహంగా మారింది. వేకువజామున 2గంటల నుంచి సర్వదర్శనాలు, వ్రతాలు ప్రారంభించగా సాయంత్రం 4 గంటల వరకు నిరంతరాయంగా రద్దీ కొనసాగింది. ఒక దశలో క్యూలైన్లు, వ్రత మండపాలు కిక్కిరిసి నిండిపోవడంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. వాహనాల పార్కింగ్‌తో గందరగోళ పరిస్థితులు రావడంతో ఎస్‌ఐ హరిబాబు కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలను కొండదిగువ కళాశాల మైదానంలో పార్కింగ్ చేయించి కొండ దిగువ నుంచి ఉచిత బస్సుసౌకర్యం కల్పించారు. సుమారు 90వేలమందిని స్వామిని దర్శించుకోగా సత్యదేవ నిత్యాన్నదాన పథకం ద్వారా 25వేలమందికి ఉచిత పులిహోర పంపిణీ చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 2 గంటలు, ఉచిత దర్శనానికి 3గంటల సమయం భక్తులు వేచిఉండాల్సి వచ్చింది. చైర్మన్ రోహిత్ దగ్గరుండి ఎటువంటి తోపులాటలు జరగకుండా పర్యవేక్షించారు. ఆదివారం ఒక్కరోజు 9వేల జంటలు సత్యదేవుడి వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షలు ఆదాయం లభించింది. భక్తుల రద్దీతో అంత్రాలయం దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేసి శీఘ్రదర్శనానికి పరిమితం చేశారు. దిగువభాగంలో ఉన్న యంత్రాలయం సాయంత్రం వరకు పూర్తిగా నిలిపివేశారు. ఈవో సుబ్బారావు సత్యగిరికొండ, వ్రత మండపాలలో తిరుగుతూ కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. కాగా రత్నగిరిపై కార్తీక సోమవారం జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఆదివారం రాత్రే భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. వసతి గదులు సరిపడక ఆరుబయట విశ్రమించారు.




క్యూలో బారులు తీరి సత్యదేవుడి దర్శనానంతరం వస్తున్న భక్తులు

కన్నీటితో.. కన్నరుణం..

తీర్చుకున్న కూతురు


-కాట్రేనికోన (ఆంధ్రజ్యోతి)

డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లి పంచాయతీ లచ్చిరాజుచెరువులో బడుగు వెంకటరమణ (48) అనారోగ్యంతో మృతిచెందాడు. అతడికి కొడుకులు లేరు. ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. భార్య అనారోగ్యంతో ఉంది. పెద్ద కూతురుకు పెళ్లయ్యింది. రెండో కుమార్తె శ్రావణి ఆదివారం తన తండ్రికి కన్నీటితో తలకొరివి పెట్టింది.

సింగపూర్‌లో విద్యావ్యవస్థ పరిశీలనకు తెలుగు టీచర్ ప్రభావతి

అంతర్వేది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలంక జీఎంసీ బాలయోగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూలు అసిస్టెంట్, తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న గుండేపల్లి ప్రభావతికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇటీవల లభించింది. ఏపీ ఎన్జీసీ స్టేట్ మోనిటరింగ్ అధికారిగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. 2012నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్‌సీఈఆర్టీలో స్టేట్ రిసోర్సుపర్సన్‌గా అనేక కరదీపకలను రూపొందించడంలో పాల్గొన్నారు. ఎన్నో ఆర్థిక సహాయ సహకారాలు అందించారు. ఈనెల 27 నుంచి డిసెంబరు 2వరకు సింగపూర్‌లోని విద్యావ్యవస్థను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తుదని ఆమె తెలిపారు. ఆమెను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, జిల్లా యంత్రాంగం అభినందించారు.


గుండేపల్లి ప్రభావతి

వెంకన్న ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

వాడపల్లిలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పూజలు


వాడపల్లి వెంకన్న ఆలయంలో అయ్యన్నపాత్రుడికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచి కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న శ్రీదేవి భూదేవి సమేత వాడపలి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం పూర్ణకుంభంతో మేళతాళ మంగళవాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించుకుని స్వామిని దర్శించుకున్నారు. వసంత మండపంలో వేద పండితుల ఆశీర్వచనం స్పీకర్ దంపతులతో పాటు కుటుంబ సభ్యులు అందుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచంద్రరావు స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం సమర్పించారు. అనంతరం విలేకర్లతో స్పీకర్ మాట్లాడుతూ స్వామివారు ఎంతో ప్రాచూర్యం పొందారని, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ఖ్యాతిని అర్జించడంతో దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారన్నారు. తాను సామాన్య భక్తుడిలానే కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకున్నానన్నారు. క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని, మరింత అభివృద్ధికి సహకారం అందిస్తానని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని, దీనికి అనుగుణంగా మహిళలతో ఆలయాల్లో రద్దీ పెరిగిందని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే బండారు తనయుడు బండారు సంజీవ్, టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచ్ కాయల జగన్నాథం, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎస్‌ఐ రాము, నాయకులు ఉన్నారు.


వరి కోత పనులకు వచ్చి...

విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి... మృతులు పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం వాసులు

గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యమ్మపాలెం నుంచి సింగరంపాలెనికి ఆదివారం ఉదయం వరి కోత మిషన్‌ను ఐషర్ వ్యాన్ మీద తీసుకెళ్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్‌ఐ యువి శివ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఐషర్ వ్యాన్ పై వరి కోత మిషన్‌ను తరలిస్తుండగా దారి మధ్యలో 11కెవి విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ గెడ్డం సందీప్ (20) షాక్‌తో మృతిచెందాడు. ముందు బండి మీద వెళుతున్న మిషన్ యజమాని కరిపెట్టి సింహాద్రి అప్పన్న (53) వెనక్కి వచ్చి ఏమయిందోనని ఆందోళనతో వ్యాన్‌ను ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతిచెందిన ఇద్దరు పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు, రాపాక గ్రామాలకు చెందినవారు. వరి కోత పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చినట్టు పోలీసులు తెలిపారు. డ్రైవర్ ఎడమ వైపునకు రావడంతో మిషన్ పైన గొట్టం విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ సరఫరా అయినట్టు తెలిపారు. మృతదేహాలను అంబులెన్స్‌లో మార్చురీకి తరలించామన్నారు. రైతుల మోటార్లకు త్రి ఫేస్ విద్యుత్తు సరఫరా ఉండడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందన్నారు. సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ శివ నాగబాబు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ




సందీప్, సింహాద్రి (ఫైల్)



మనస్తాపంతో ఉరేసుకున్న బాలింత

మండపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో భర్త మాటలకు మనస్తాపానికి గురైన 4 నెలల బాలింత ఉరివేసుకుంది. మండపేట రూరల్ సీఐ పీతల దొర్రాజు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బోడసకుర్రుకు చెందిన మట్టా వేణు(28)కు ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలెనికి చెందిన రేఖ(24)తో మూడేళ్లక్రితం వివాహం జరిగింది. మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లిలో ఉన్న కొబ్బరితోటలో కపాలదారుడిగా ఉంటున్న రేఖ తండ్రి నేదునూరు శ్రీను 4 నెలల క్రితం కూతురిని పురుడు కోసం రేఖ వేములపల్లికి తీసుకొచ్చాడు. రేఖకు మగబిడ్డ పుట్టాడు. తర్వాత రోజూ తన భర్తతో ఫోన్‌లో మాట్లాడేది. శనివారం రాత్రి భర్తతో ఫోన్ మాట్లాడుతున్న సమయంలో వారి మధ్య మాటామాటా పెరిగింది. వేణు బోడసకుర్రులో ఇంటి నిర్మాణానికి భార్యను రూ.లక్ష తీసుకురమ్మని డిమాండ్ చేశాడు. తన తండ్రి వద్ద డబ్బు లేదని, కుటుంబ పరిస్థితి బాగాలేదని చెప్పింది. అయినా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో తన కూమార్తె మనస్తానికి గురై శనివారం తెల్లవారుజామున పొలంలో ఉన్న పాకలో దూలానికి చీర కట్టి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సంఘటనాస్థలాన్ని మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు, రూరల్ ఎస్‌ఐ సంఘటనా పరిశీలించారు. కేసు నమోదు చేశామని మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. తల్లిని కోల్పోయిన నాలుగు నెలల బాబు పరిస్థితి దయనీయంగా మారింది.


రేఖ (ఫైల్)

గోదావరిలో స్నానానికి దిగి పదోతరగతి విద్యార్థి మృతి

కపిలేశ్వరపురం/ అంబాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక వద్ద ఆదివారం గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు యువకుడు మృతిచెందాడు. అంగర ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన నామాడి బన్ను (15) కేదార్లంక శివారు వీధివారిలంక ధనమ్మ మర్రి వద్దకు స్నేహితులతో కలిసి వచ్చాడు. అనంతరం గోదావరి నదిలో స్నానానికి ముగ్గురు స్నేహితులతో కలిసి దిగాడు. వారిలో బన్ను గల్లంతయ్యాడు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. విహారయాత్రకు వెళ్లిన బన్ను(15) గోదావరిలో మృతిచెందడంతో పుల్లేటికుర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. బన్ను పుల్లేటికుర్రు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అతడి తండ్రి అబ్రహం ఆటో డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బన్ను పెద్ద కుమారుడు కాగా చిన్న కుమారుడు అభిషేక్ ఆరో తరగతి చదువుతున్నాడు.


బన్ను (ఫైల్)

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంకర్ అన్‌లోడు చేస్తుండగా మంటలు

అదుపు చేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని భారత పెట్రోల్ బంక్‌లో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం పెట్రోల్ బంక్‌లోకి వెళ్లిన ఆయిల్‌ట్యాంకర్ నుంచి అండర్‌గ్రౌండ్‌లో ఉన్న ట్యాంకర్‌లోకి పెట్రోల్‌ను అన్‌లోడు చేస్తుండగా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మంటలు చెలరేగాయి. దీంతో అక్కడి సిబ్బందితో పాటు పెట్రోల్ కోసం వచ్చిన వాహనదారులు పరుగులు తీశారు. దీంతో భయానక వాతవరణం ఏర్పడింది. ఒకరిద్దరు సిబ్బందిని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. బంక్ నిర్వాహకుల సమాచారంతో ఆర్యాపురం అగ్నిమాపక శాఖ ఫైరింజన్ సకాలంలో బంక్ వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఏ మాత్రం ఆలస్యమైనా పెనుప్రమాదం జరిగి భూగర్భంలో ఉన్న ఆయిల్‌ట్యాంక్‌లు పేలి చుట్టుపక్కల ప్రాంతాలు, వ్యాపార సంస్థలు తునాతునకలై ప్రాణనష్టం జరిగిఉండేది. ప్రమాదం తప్పి పెద్దగా ఆస్తినష్టం జరగలేదు.


పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంకర్ వద్ద చెలరేగుతున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

మరో ఇద్దరికి గాయాలు


మృతిచెందిన బుజ్జి బాబు

వై.రామవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం చవిటి దిబ్బలు శివారులో ఆదివారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. పి.ఎర్రగొండకు చెందిన జల్లి బుజ్జి బాబు (19) సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. బుజ్జిబాబు అడ్డతీగల వైపు నుంచి పి.ఎర్రగొండ వస్తుండగా మరో ద్విచక్ర వాహనంలో గొడుగురాయికి చెందిన వీకా ఈశ్వర దొర, కురసం విశ్వతేజ అనే యువకులు ఎదురుగా వస్తున్నారు. వారిద్దరి కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్సులో వై.రామవరం ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేస్తున్నట్టు వైద్యుడు జీవన్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

రూ. 14 లక్షలకు పైగా ఆస్తినష్టం

అంబాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి పరిధిలోని తిరుమనాథంవారిపాలెం శివారులో ఆదివారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిల్లు దగ్ధం కాగా రూ.14 లక్షలకు పైగా ఆస్తినష్టం సంభవించింది. స్థానికులు వివరాలు ఇలా ఉన్నాయి. కె.పెదపూడి చెందిన ఈతకోట సుబ్బారావు, ఈతకోట శ్రీనివాసరావు, ఈతకోట ఈశ్వరరావు, ఈతకోట మంగాయమ్మకు చెందిన తాటాకిళ్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం కాగా గృహోపకరణ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. తొలుత సుబ్బారావు, శ్రీనివాసరావు ఉంటున్న తాటాకింటికి నిప్పటుంకోగా పక్కనేఉన్న ఈశ్వరావు ఇంటికి మంటలు ఒక్కసారిగా వ్యాపించి రెండు ఇళ్లు కాలి బూడిదయ్యాయి. స్థలం కొనుగోలు కోసం దాచుకున్న సుబ్బారావుకు చెందిన నగదు రూ.1.50లక్షలు, 12 గ్రాముల బంగారం, అతడి కుమారుడి సర్టిఫికెట్లు, శ్రీనివాసరావుకు చెందిన రూ.2.50లక్షల నగదు, 18 గ్రాముల బంగారం, సర్టిఫికెట్లు, మంగాయమ్మకు చెందిన రూ.1.50 లక్షలు, బంగారం, ఈశ్వరరావుకు చెందిన రూ.2.70లక్షల నగదు, బంగారం గృహోపకరణ వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. అమలాపురం అగ్నిమావక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు.


అగ్నికి ఆహుతవుతున్న తాటాకిళ్లు

అంతర్ జిల్లాల జూడో చాంపియన్ 'అనంతపురం'

బాల, బాలికల విభాగాల్లో సత్తా చాటిన క్రీడాకారులు

సర్పవరం జంక్షన్, నవంబరు 9 (ఆంధ్ర జ్యోతి): అంతర్ జిల్లాల జూడో చాంపియన్లుగా అనంతపురం జిల్లాకు చెందిన బాల, బాలికల జట్లు నిలిచాయి. రాష్ట్ర అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జూడో చాంపియన్‌షిప్ అండర్-17 పోటీలు రెండు రోజులుగా కాకినాడ డీఎస్ఏ మైదానంలో హోరాహోరీగా సాగాయి. ఫైనల్ పోటీలు ఆదివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడి హైస్కూలు క్రీడా ప్రాంగణంలో రసవత్తరంగా జరిగాయి. బాల, బాలికల విభాగాల్లో అనంతపురం జట్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. విజేతలకు కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సతీష్, కాకినాడ రూరల్ ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు, ఎంఈవో-2 శ్రీనివాస్‌కుమార్, జూడో సంఘ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. బాలుర విభాగంలో కృష్ణా (ద్వితీయ), కర్నూలు (తృతీయ), బాలికల విభాగంలో చిత్తూరు (ద్వితీయ), గుంటూరు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ఆయా జిల్లాల జట్ల క్రీడాకారులకు కూడా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ కె.శ్రీ నివాస్, పీఈటీల సంఘ కార్యదర్శి వి.మాచరిరావు, కోశాధికారి కె.నాగలింగేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకు డు ప్రతాపరెడ్డి, రవిరాజు, గిరి, ప్రసాదరెడ్డి, మూర్తి, శ్రీహరిరాజు తదితరులు పాల్గొన్నారు.


అనంతపురం బాలికల, బాలుర జట్లకు బహుమతులు అందజేస్తున్న అధికారులు



వైఎంసీఏ ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు


విజేతలకు షీల్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. రీజనల్ స్థాయిలో 152 మంది క్రీడాకారులతో 14జట్లు పాల్గొన్నాయి. వైఎంసీఏ సౌత్ ఇండియా రీజియన్ చైర్మన్ డాక్టర్ టి.సుమన్‌త్యాగరాజ్, కార్యదర్శి రెవ ఎ స్.ధనరాజ్, పూర్వపు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రోలాండ్ విలియమ్స్, అమలాపురం శాఖ అధ్యక్షుడు ఎం. బాలాస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈపోటీలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ప్రారంభించారు. జూనియర్, సీనియర్స్ విభాగంలో లీగ్ పద్ధతిలో పోటీలు నిర్వహించారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పప్పుల శ్రీరామచంద్రమూర్తి, కోచ్‌లు ఐ.భమేష్, కట్టా పురుషోత్తం పర్యవేక్షించారు.

విజేతగా రాజమహేంద్రవరం జట్టు..

సీనియర్స్ విభాగంలో 4 జట్లు, జూనియర్స్ విభాగంలో 8 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. పోటీల అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మెన్ విభాగంలో రాజమహేంద్రవరం జట్టు విన్నర్‌గా, యానాం జట్టు రన్నర్‌గా నిలిచింది. వైఎంసీఏ బాలయోగి స్టేడియం జట్టు తృతీయస్థానం సాధించింది. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో అంబాజీపేట జట్టు ప్రథమ, అమలాపురం జిల్లాపరిషత్ బాలికోన్నత జట్టు ద్వితీయ, అమలాపురం బాలుర ఉన్నత పాఠశాల జట్టు తృతీయ స్థానం సాధించారు. బాలుర విభాగంలో యానాం జట్టు ప్రథమ, అమలాపురం జట్టు ద్వితీయ, అంబాజీపేట జట్టు తృతీయ స్థానాలు సాధించగా విజేతలకు ఎమ్మెల్యే ఆనందరావు షీల్డులు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో యు.మణిప్రసాద్, గెల్లా కృపావరం, చిట్టి మోషేను, శాంతిప్రకాష్, ఎ.ప్రసన్న, గోపీరాజు పాల్గొన్నారు. అలాగే ముఖ్య అతిథులను దుశ్శాలువాలతో సత్కరించారు.

ఆ రోజులు మళ్లీరావు..

ఏడున్నర పదుల వయసులోనూ ఎంతో ఉత్సాహం

గొల్లప్రోలులో కలిసిన 1964-65 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏడున్నర పదుల వయస్సులోనూ వారిలో ఉత్సాహం ఉరకలు వేసింది. ఆరు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న వీరంతా కార్తీకమాసంలో ఏటా కలుసుకుంటారు. చిన్ననాటి సంగతులు గుర్తుకు తెచ్చుకుంటూ కుటుంబాల విషయాలు చర్చించుకుంటూ నూతనోత్తేజం పొందుతారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1954-65 ఎస్ఎస్ఎల్‌సీ(టెన్త్) బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పట్టణంలోని డాక్టర్ మల్లిరెడ్డి వెంకట్రాజు మెమోరియల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేదికగా కలుసుకున్నారు. వారు గత 26 ఏళ్లుగా ఏటా కార్తీకమాసంలో కలుసుకుంటున్నారు. ఆదివారం కలుసుకున్న వీరంతా చిన్ననాటి జ్ఞాపకాల్లోకి వెళ్లిపోయారు. పిల్లలు మాదిరిగా నాడు తరగతి గదుల్లో చేసిన అల్లర్లు, చిలిపి పనులు, నాడు జరిగిన పోటీలు తదితర అంశాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కుటుంబసభ్యుల వివరాలును పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సరదాగా గడిపిన వీరంతా భారమెక్కిన హృదయాలతో పరస్పరం వీడ్కోలు చెప్పుకున్నారు. తొలుత 76మంది వరకూ ఉండగా ప్రస్తుతం 30 మంది కలుసుకున్నారు.


గొల్లప్రోలులో కలిసి అలనాటి సంగతులు పంచుకుంటున్న పూర్వ విద్యార్థులు



రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నారాయణరావుకు సీపీ బ్రౌన్ స్మారక అవార్డు


నారాయణరావుకు అవార్డు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలుగు ఇంగ్లీష్ నిఘంటువు రూపకర్త, తెలుగు భాషాభ్యుదయానికి ఎనలేని సేవలందించిన సీపీ బ్రౌన్ జయంతిని రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గోకవరం బస్టాండ్ వద్ద డాక్టర్ కంటే వీరన్నచౌదరి హాస్పిటల్ ఆవరణలోని ఎస్వీ బాలు స్మారక సాంస్కృతిక మందిరంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ టీవీ నారాయణరావు మాట్లాడుతూ ఆంగ్లేయులైనా సీపీ బ్రౌన్ తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. స్థానిక గౌతమీ గ్రంథాలయంలో నేటి తరానికి పనికివచ్చే ఎన్నో వేల పురాతన తెలుగు పుస్తకాల డిజిటలైజేషన్ చేస్తూ, అంత్యప్రాస నిఘంటువును రూపుదిద్ది, వెలికితెచ్చిన అరిపిరాల నారాయణరావుకు బ్రౌన్ పురస్కారానికి ఎంపిక చేయడం ఎంతో సముచితమని అన్నారు. కార్యక్రమంలో తోట సుబ్బారావు, తిరుమల కృష్ణమోహన్, సూరపురెడ్డి తాతారావు, రాకా కార్యదర్శి జీవీ రమణ, నూజిళ్ల సూర్యనారాయణ, జోరా శాస్త్రి, మహమ్మద్ షా ఆలీ, ఎం.ఏడుకొండలు పాల్గొన్నారు.

రంపయర్రంపాలెంలో అమరవీరుల సభ


రంపయర్రంపాలెంలో నిర్వహిస్తున్న అమరవీరుల సభ

గోకవరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): విప్లవ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రంపయర్రంపాలెం గ్రామంలో అమరవీరుల సభ జరిగింది. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ బూటకపు ఎన్‌కౌంటర్లలో ఎందరో విప్లవ వీరులు అమరులయ్యారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం అమాయక ప్రజలను ఎన్‌కౌంటర్ చేసి చంపుతోందని, వెంటనే నిలివేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న జగ్గంపేట, 15న కాకినాడ, 22న రంపచోడవరం,25న రాజమహేంద్రవరంలో జరిగే అమరవీరుల సంస్మరణ సభలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే అంజిబాబు, పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, ప్రగతి శీల మహిళా సంఘం(స్త్రీ విముక్తి) జిల్లా కన్వీనర్ డొక్కులూరి సంగీత, గోలి మునలయ్య, అబ్బులు, వెంకటేశులు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడవాలి


హాస్టల్ అధికారులకు చిత్రపటం అందజేస్తున్న రామకృష్ణ మఠం స్వామిజీలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ విలువలతో కూడిన విద్యను అభ్యసించి సన్మార్గంలో నడవాలని రామకృష్ణ మఠం స్వామి అర్చనానంద పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సమీకృత బీసీ బాలికల వసతిగృహంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. స్వామి శశికాంతనంద, స్వామి పరిజ్ఞయానంద, లెక్చరర్ వీర్రాజు తదితరులు మాట్లాడారు. అనంతరం విద్యార్థినిలకు వివేకానంద సూక్తుల పుస్తకాలు, స్వీట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యువో ముత్యాల సుబ్బారావు, హెచ్‌డబ్ల్యువో ఎ.సూర్యకుమారి పాల్గొన్నారు.

గోలింగేశ్వరాలయంలో పూజలు



బిక్కవోలు, నవబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర కావడంతో ఆదివారం మండలంలోని శివాలయాలకు శివనామస్మరణతో భక్తులు పోటెత్తారు. బిక్కవోలులోని ప్రాచీన గోలింగేశ్వరస్వామి దర్శనానికి తెల్లవారజామునుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామికి లక్ష బిల్వార్చన, పార్వతిదేవికి లక్ష కుంకుమార్చన జరిపారు. కొంకుదురు బుడతల మామిడి వద్ద త్రిముఖలింగేశ్వరస్వామి, బలభద్రపురంలోని ద్వాదశ జ్యోతిర్లింగ, ఇల్లపల్లిలోని పాదరస లింగ, ఊలపల్లిలోని అగస్త్యేశ్వర స్వామి దర్శనాలను భక్తులు పోటెత్తారు.

వేమగిరి కొండపై గణపతి హోమం


హరిహర క్షేత్రంలో గణపతిహోమం నిర్వహిస్తున్న దృశ్యం

కడియం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరి కొండపై హరిహర క్షేత్రంగా పిలువబడే విశ్వేశ్వరస్వామి, జనార్దనస్వామి ఆలయాల ప్రాంగణంలో ఆదివారం గణపతి హోమం వైభవంగా జరిగింది. అల్లంపల్లి ముత్యాలరావు గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీధర్మశాస్తా పీఠం గురుస్వామి వెంకటఅచ్చారావు పర్యవేక్షణలో, అయ్యప్ప, శివస్వాముల సంయుక్త ఆధ్వర్యంలో, ప్రగడ వెంకటరామారావు దంపతులు, ప్రగడ కృష్ణకొండ దంపతులు శాస్త్రోక్తంగా ఈ హోమాన్ని నిర్వహించారు. అలానే భక్తులు, గ్రామస్థుల సహకారంతో వన భోజనాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బిక్కవోలులో ఘనంగా పేటతుళ్లి



బిక్కవోలు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో అయ్యప్ప మాలధారులు ఆదివారం ఘనంగా పేటతుళ్లి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గురుస్వామి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో 60 మంది స్వాములు అయ్యప్పస్వామిని రథంలో వుంచి గ్రామోత్సవం జరిపారు.దీనిలో భాగంగా నిర్వహించిన స్వాముల పేటతుళ్లి, కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

ఐక్యతకు ప్రతీకలు

- ఘనంగా వనసమారాధనలు
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నాపెద్ద
- సాంస్కృతిక కార్యక్రమాలు.. పోటీలు
- విజేతలకు బహుమతులు


దివాన్‌చెరువు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ఆదివారం వనసమారాధనలు ఉత్సాహంగా సాగాయి. పలు సామాజిక వర్గాల వారు జోరుగా హుషారుగా వనసమారాధనలలో పాల్గొన్నారు. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహా పుష్కరవనంలో బ్రాహ్మణ ఉద్యోగుల సేవా సమూహం (బెస్ట్) వనసమారాధన నాయకులు కాశీవఝుల శ్రీనివాస్, కేఎన్‌బీ లక్ష్మి, మాంథాత రామకృష్ణ, కంభంపాటి రామగణేష్, వక్కలంక త్రినాథకుమార్ నాయకత్వంలో జరిగింది. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవాలని కోరారు. ఐసీడీఎస్ రాష్ట్ర అసోసియేషన్ నాయకుడు ధర్మాల శ్రీకాంత్‌రాజు మాట్లాడుతూ బెస్ట్ సమూహం ఉద్యోగ మిత్రులను నమోదు చేసుకుని తరచుగా సమావేశాలు నిర్వహించుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అలాగే గౌతమీ ఘాట్ వాకర్స్ యోగా వెల్ఫేర్ అసోసియేషన్ వనసమారాధన నిర్వహించుకుంది. ఈ వన భోజనాలకు వచ్చిన జనంతో పుష్కరవనం సందడిగా మారింది. అలాగే దివాన్‌చెరువు-శ్రీరాంపురం మధ్య తోటల్లో జరిగిన కాపునాడు కార్తీక వనసమారాధనకు హాజరైన రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ యువత విద్య, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అనుశ్రీ సత్యనారాయణ, యర్రా వేణుగోపాలరాయుడు, బొర్లపూడి క్రాంతి, మజ్జి పద్మ, జక్కంపూడి విజయలక్ష్మి, ఆకుల వీర్రాజు, మేడపాటి షర్మిలారెడ్డి హాజరయ్యారు. వారిని కాపునాడు జోన్-2 అధ్యక్షుడు గుదే రఘునరేష్, ముమ్మిడి వీరబాబు, దేశినీడి రాంబాబు, కాళ్ల చక్రరావు, రుద్రప్రసాద్, ర్యాలి రామకృష్ణ, పిల్లా ప్రసాద్, గోపిశెట్టి విజయలక్ష్మి, దుర్గాదేవి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పిల్లలకు, పెద్దలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బిక్కవోలు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకుదురులో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల డాన్సులు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో రెడ్డి సంఘ అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, కాకినాడ శ్రావణి హాస్పిటల్ అధినేత డాక్టర్ సత్తి వీర్రెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, సత్తి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో..

అనపర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలో గాయిత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వన సమారాధనకు బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డి.సత్యప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుత తులసీ ధాత్రి సహిత లక్ష్మీనారాయణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు పలు అంశాల్లో పోటీలు జరిపి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండపేట బ్రాహ్మణ సంఘం ప్రతినిధి సుబ్రహ్మణ్యం, నాగదేవర సూరిబాబు, రెడ్డి సతీష్, చింత ఆనంద్, బొద్దవరపు శేషగిరి, సుబ్బారావు, పెద్దింటి వేణు, చందు, రంగాచార్యులు పాల్గొన్నారు.

వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం గొర్రెల వీరసూర్య అప్పారావు తోటలో రాజమండ్రి వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన సమారాధనకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వీరరాఘవమ్మ ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఉసిరి చెట్టుకు, తులసి మొక్కకు వాసు పూజచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. అనంతరం జరిగిన ఆటల పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు.


కొంకుదురులో డ్యాన్సులు చేస్తున్న చిన్నారులు


అనపర్తిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


రాజమహేంద్రవరంలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసు

నేడు లక్ష దీపోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ ఉమా కోటిలింగేశ్వరస్వామి దేవస్థానం, పంతం చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కోటిలింగాలపేట శ్రీ ఉమా కోటిలింగేశ్వస్వామి ఘాట్ వద్ద లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు తెలిపారు.

రాజానగరంలో సామూహిక వ్రతాలు


వాసవీమాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రాజానగరంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తులసి ధాత్రి సమేత లక్ష్మీనారాయణ, సత్యనారాయణస్వామి వ్రతాలను కన్నుల పండువగా నిర్వహించారు. మండలంలోని ఆర్యవైశ్యులు విచ్చేసి ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన వన సమారాధనలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కోయభాషలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన నాయకుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరంలోని గిరిజన సంక్షేమ కళాశాల వసతిగృహం-1 విద్యార్థినిలకు కోయ భాషలో వ్యాసరచన,వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బిర్సా ముండా జీవితం, పోరాట స్ఫూర్తి అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించినట్టు హాస్టల్ సంక్షేమ అధికారిణి ఎస్ఎస్ లక్ష్మీకాంతి తెలిపారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖాధిపతి పీవీబీ సంజీవరావు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

అక్రమంగా బొండు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

సీతానగరం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సీతానగరం కైలాసగిరి రేవు నుంచి అక్రమంగా బొండు మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను వీఆర్వో వెంకట్రావు, కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు ఆదివారం ఉదయం సీజ్ చేశారు. వీఆర్వో విలేకరులతో మాట్లాడుతూ తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆదేశాలతో దాడి చేసి ఎటువంటి అనుమతులు లేకుండా మట్ట శ్రీను, పేరూరి మణికంఠ, పోలిన రాజులకు చెందిన ట్రాక్టర్లు అక్రమంగా బొండు మట్టి తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తవ్వకాలు జరిపే ప్రాంతానికి వెళ్లి చూడగా జేసీబీ, ఇతర ట్రాక్టర్లు అక్కడ నుంచి వెళ్లిపోయాయన్నారు. రైతు లంక భూమిలో తవ్వకాలు జరుపుతున్నారని చెప్పారు. ట్రాక్టర్లను తహశీల్దార్ ఆదేశాలతో పోలీస్‌స్టేషన్‌కు తరలించామని వీఆర్వో పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోరుకొండ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదరాడ గ్రామంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరయిన సొమ్ముల తాలూకు చెక్కులను ఆదివారం జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అందజేశారు. బత్తుల ధన్వంతరికి రూ.86,015, మారపట్ల రిబ్కాకి రూ.51,310, దివసం రాజుకు రూ.25,437, పిన్నమరెడ్డి పెంటయ్యకు రూ.41,263, అప్పన బాబూరావుకు రూ.70,000, వంక కుశాంక్ రూ.57,918 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

స్వదేశీ వస్తువులను కొనండి


అనపర్తిలో స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న సురేంద్రరెడ్డి, హేమతులసి

అనపర్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు విదేశీ వస్తువులను కాకుండా స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయడంతో దేశ ఆత్మ గౌరవాన్ని పెంపొందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లిడి సురేంద్రరెడ్డి అన్నారు. అనపర్తిలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురేంద్రరెడ్డి, గొల్లు హేమతులసి కార్యక్రమ స్టిక్కర్లను ఆవిష్కరించారు.అనంతరం ఇంటింటికీ వెళ్లి స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. స్టిక్కర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి సూర్య ప్రభావతి, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు గిరిడా గంగాభవాని, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, గంజా వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సీఐ మంగాదేవి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్‌లో ఆదివారం మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మంగాదేవి ఆధ్వర్యంలో మహిళా రక్షణ, చిన్నపిల్లలపై జరిగే నేరాలు, గంజాయి నేరాలు నియంత్రణకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శక్తి యాప్ వినియోగం, మహిళలపై జరిగే నేరాల నియంత్రించడం, పోక్సో, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థినులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వచ్చేటప్పుడు ఒక కంట కనిపెట్టుకుని వుండాలని తల్లిదండ్రులకు సూచించారు. రాత్రింబవళ్లు మహిళలకు భద్రత రీత్యా అవసరమైన జిల్లా శక్తి టీం, ఈగల్ టీం వివరాలను వెల్లడించారు.గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు, చట్ట ప్రకారం తీసుకునే చర్యలను వివరించారు.గంజాయి, మాదక ద్రవ్యాల సమాచారం తెలిస్తే 112, 1972కు కాల్ చేసి తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఈగల్ టీమ్ ఎస్ఐ సురేష్‌కుమార్,శక్తిటీం యూనిట్-2 ఇన్‌చార్జి హెచ్‌సీ ఎండీ ఆలీ,ఈగల్ టీం హెచ్‌సీ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రుద్ర, చండీ హోమాలు

కడియం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కడియపులంక విశ్వేశ్వర హైటెక్ నర్సరీలో కార్తీక మాసం సందర్భంగా నక్కా కాశీవిశ్వేశ్వరరావు, అమ్మిరాజు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం రుద్రహోమం, చండీహోమం వైభవంగా నిర్వహించారు. అనంతరం రథయాత్ర నిర్వహించారు. కార్యక్రమాల్లో బొర్లంపూడి క్రాంతి, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, పంతం గణపతి, గిరజాల బాబు, వైస్ ఎంపీపీ పంతం గణపతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప, శివస్వాములకు, నర్సరీ రైతులకు వనసమారాధన నిర్వహించి భోజనాలు ఏర్పాటు చేశారు.

కోట సత్తెమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ తల్లి

నిడదవోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ ఆలయాన్ని వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారు ప్రత్యేక పూల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఆర్యన్
సూర్యమినీ	: ఫీనిక్స్
సూర్యప్యాలస్	: ప్రిడేటర్
స్వామి	: జటాధర
అనుశ్రీ(సాయికృష్ణ)	: ప్రేమిస్తున్నా, కె-ర్యాంప్
శివజ్యోతి	: ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో
రాజా	: జటాధర
ఊర్వశి	: తెలుసు కదా
మేనక	: కృష్ణలీల
రంభ	: ప్రిడేటర్
అప్సర	: ది గర్ల్ ఫ్రెండ్
అశోక	: మాస్ జాతర
వీఎస్ మహల్(నామవరం)	: ప్రిడేటర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: ది గర్ల్ ఫ్రెండ్
వెంకటసూర్య(కడియం)	: జటాధర
సత్యగౌరి (అనపర్తి)	: జటాధర
సూర్యశ్రీ (అనపర్తి)	: మాస్ జాతర
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మాస్ జాతర
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: మాస్ జాతర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: బాహుబలి
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్

ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు

- దరఖాస్తుకు ఈ నెలాఖరు గడువు
- ఎన్నారై చెక్కపల్లి రమేష్ ట్రస్ట్ కార్యదర్శి ఎండీ ఇబ్రహీం

ప్రత్తిపాడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ఆర్థిక తోడ్పాటును అందించనున్నట్టు ఎన్నారై చెక్కపల్లి రమేష్ ట్రస్ట్ కార్యదర్శి ఎండీ ఇబ్రహీం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 2025-26 విద్యా సంవత్సరంలో ఐఐటీ, నీట్, జేఈఈ, మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఎంసెట్‌లో 10వేల లోపు ర్యాంక్ సాధించి, ఆర్థికంగా బాగా వెనుకబడిన విద్యార్థుల్లో ఒక్కొక్కరిని ఎంపిక చేసి ట్రస్ట్ ద్వారా ఉపకార వేతనం అందజేయనున్నట్టు తెలిపారు. అమెరికాలో స్థిరపడిన ఎన్నారై చెక్కపల్లి రమేష్ ట్రస్టీగా ప్రతిభ కలిగి ఉండి ఆర్థికంగా బాగా వెనుకబడిన విద్యార్థులకు 2012-13 సంవత్సరం నుంచి ఏటా అర్హులైన విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నారు. అర్హులైన విద్యార్థులు 99494 22468, 85558 70079 నెంబర్లను సంప్రదించాలని కోరారు. దరఖాస్తులను http://acrobat.adobe.com/id/urn:aaid:sc:AP:5 08599d8&1947&4eaa&9f64&15965657786 లింకు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.దరఖాస్తుకు ఈ నెల 30 వరకు గడువు ఉందని తెలిపారు.

కుడి..ఎడమైతే..ప్రమాదమేనోయ్!

- రైట్ రూట్ మూసివేతతో రాంగ్ రూట్‌లోకి వాహనదారులు
- ప్రమాదకరంగా ఈట్‌స్ట్రీట్ రోడ్డు జంక్షన్


రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలు


కూడలిని మూవబుల్ డివైడర్లతో మూసివేసిన దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో కొన్ని రహదారులు చాలా ప్రమాదకరంగా మారుతున్నాయి.అధికారుల తప్పిదాల వల్ల రైట్ రూట్‌లు మూతపడి రాంగ్ రూట్ పట్టేలా చేస్తున్నాయి. ఫలితంగా వాహనాలు రాంగ్ రూట్‌లోకి ప్రవేశించి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటువంటి కోవలోకి రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ఆర్‌ఐవో కార్యాలయం నుంచి వై-జంక్షన్ సబ్‌స్టేషన్ మలుపు రోడ్డు మారింది. ఈ రోడ్డు వై-జంక్షన్ నుంచి నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. అయితే ఈట్ స్ట్రీట్ రోడ్డులోంచి వస్తే సబ్‌స్టేషన్ మలుపు వద్ద ఎదురుగా రోడ్డు గుండా డివైడర్ జంక్షన్ దాటి వై-జంక్షన్ రోడ్డులోకి వాహనాలు తిరగాలి. కాని ఈ కూడలి రోడ్డును మూవబుల్ డివైడర్లతో మూసివేయడంతో దానికి దిగువన రైతు బజార్ ఎదురుగా ఉన్న జంక్షన్ వైపు రాంగ్ రూట్‌లో వంద మీటర్ల వరకు వాహనాలు వెళ్లి కూడలి దాటుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందిచి రైట్ రూట్‌కు క్లియరెన్స్ ఇస్తే ప్రమాదాలు తగ్గుతాయి. అందువల్ల మూసివేసిన రూట్‌ను తెరిచి వాహనాలకు అనుమతి ఇవ్వాల్సిన అవసరం ఉంది.



హత్యకు గురైన బాలిక

పాపం.. ఏం చేసిందని!

- తెలిసినవాడిగా ఇంట్లో చేరిక
- కొన్నాళ్లుగా నగదు, బంగారంపై కన్ను
- చోరీని బాలిక గమనించడంతో హత్య
- పోలీసులకు పట్టించిన అతి ప్రవర్తన



సిర్రా రంజిత(ఫైల్‌ఫొటో)

ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో కూడా తెలియడం లేదు.. నమ్మితే నట్టేట ముంచేసే వాళ్లు.. మన చుట్టూనే తిరుగుతున్నారు.. రామచంద్రపురంలో ఇదే జరిగింది.. ఇంట్లో నమ్మకంగాఉన్న వ్యక్తి పాపం.. ఏంచేసిందని.. ఏం చూసిందనేది ఆలోచించకుండా పదేళ్ల చిన్నారిని పొట్టన పెట్టుకున్నాడో క్రూరుడు.. చున్నీని బాలిక మెడకు చుట్టి.. ఆమెను మంచంపైకి తోసి ముఖాన్ని నొక్కి అదిమిపట్టి హత్యచేశాడు. తనపై ఎవరికీ అనుమానం రాకుండా బాలిక మృతదేహాన్ని ఫ్యాన్‌కు ఉరితీసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ఇదంతా చేసిందెవరో తెలిసి పోలీసులే అవాక్కయ్యారు. ఆ కుటుంబానికి పరిచయమున్న వ్యక్తి.. బాలిక తల్లిని అక్కా అని పిలిచేవాడే ఈ పాపానికి ఒడిగట్టాడు.. రామచంద్రపురం మండలం అంబికపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన పెయ్యల శ్రీనివాస్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. బాలిక తల్లిదండ్రులకు తొలుత అలాగే పరిచమయ్యాడు. ఇంట్లో ఎలక్ట్రికల్ సమస్య ఏదున్నా అతనికే చెప్పేవారు. వచ్చి చేసి వెళ్లిపోయేవాడు. ఆ ఇంట్లో సొంతవాడిలా మెలుగుతున్నాడు.. ఏ పని ఉన్నా వాడికే ఫోన్ చేసేలా మారిపోయాడు. అలా ఆనుపానులు చూసుకున్నాడు. బంగారం, డబ్బు దొంగిలించాలన్న దుర్బుద్ధితో ఈనెల 4న ఆ ఇంట్లోకి వెళ్లాడు. ఇంట్లో ఉన్న చిన్నారి తన చోరీ యత్నాన్ని పసిగట్టిందన్న భయంతో కర్కశంగా చంపేశాడు. బాలిక మృతదేహం పక్కనే నిలబడి కన్నీటి పర్యంతమయ్యాడు. తన నట విశ్వరూపం చూపాడు. బాలిక మృతికి తాను బాధపడుతున్నట్టుగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. బాలిక మరణించిన తర్వాత రోజు తల్లిదండ్రులు మీడియాతో మాట్లాడుతుంటే వారి పక్కనే ఉన్నాడు. ఎక్కడా ఎవరికీ చిక్కకుండా తప్పించుకున్న నిందితుడు అతి ప్రవర్తనతో పోలీసులకు దొరికిపోయాడు. అంతే అతడి పాపం పండిపోయింది.. పెయ్యల శ్రీనివాస్‌ను తొలుత పోలీసులు నిందితుడిగా అనుమానించలేదు. క్లూస్‌టీం వేలిముద్రలు సేకరిస్తుండగా వారితో అతిగా ప్రవర్తించినట్టు సమాచారం. దీంతో క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్‌కు అనుమానం వచ్చి అతడి వేలిముద్రలు తీసుకున్నారు. అదే దర్యాప్తులో కీలకంగా మారింది. శ్రీనివాస్ వేలిముద్రలు సరిపోవడంతో ఆదివారం పోలీసులు దీన్ని హత్యగా తేల్చారు. తల్లి లేని సమయంలో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించి.. బాలికను హత్య చేసి ఏమీ తెలియనట్టుగా ఉరివేసి వెళ్లిపోయాడని తేల్చారు. ఇది తెలియడంతో బాలిక తల్లిదండ్రులు ఘొల్లుమన్నారు. పాపను ఇలా చంపేస్తాడనుకోలేదని కన్నీటి పర్యంతమయ్యారు. వాడిని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హత్యకేసును నాలుగురోజుల్లో చేధించిన డీఎస్పీ రఘువీర్, సీఐలు నారాయణ, దొరరాజు, ఎస్‌ఐలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, జానీబాషా, సురేష్‌బాబు, అంగర హరీష్‌లతోపాటు ఫింగర్ ప్రింట్ బ్యూరో అమలాపురం ఇన్‌స్పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, వారి బృందం సభ్యులను జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా అభినందించారు.

- ద్రాక్షారామ(రామచంద్రపురం)-ఆంధ్రజ్యోతి

పూర్తి వివరాలు మెయిన్‌లో..

ఆపేదెవరు.. భైరవా..



భౌబోయ్.. బతకనివ్వడంలేదు!

ఎక్కడపడితే అక్కడ కుక్కలు.. అందుగలవు.. ఇందులేవని సందేహం వలదు.. ఎటు చూసినా కుక్కలే.. ఏ వీధి చూసినా కుక్కల గుంపులే.. ఎంతలా అంటే ఏ వీధిలో అడుగుపెట్టాలన్నా భయపడేంతగా కుక్కలు పెరిగిపోయాయి.. బడి..గుడి.. ఆసుపత్రి.. బస్టాండ్.. రైల్వే స్టేషన్..క్రీడాప్రాంగణాలు ఎక్కడ చూసినా అవే.. జనసమ్మర్ధ ప్రాంతాల్లో కుక్కలు కనబడ కూడదని సాక్షాత్తూ సుప్రీం కోర్టు ఆదేశించినా తీరులో మార్పేమి లేదు.. అవి యథేచ్ఛగా తిరుగుతూనే ఉన్నాయి.. అధికారులు చూస్తూనే ఉన్నారు.. కుక్కలు తరుముతుంటే జనం బౌబోయ్ అంటూ పరుగులు పెడుతున్నారు.. ఇకనైనా అధికా రులు దృష్టి పెట్టి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాల్సిందే మరి..

- (రాజమహేంద్రవరం/ కాకినాడ/ అమలాపురం రూరల్- ఆంధ్రజ్యోతి)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పట్టణం,గ్రామం అనే తేడా లేకుండా రాత్రి వేళ అధికారులను ఏ వీధిలోకి పంపించినా కుక్కలకు బంధీ లవు తారు. వీధుల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు జనం పిక్కలు లాగేయడానికి సిద్ధంగా ఉంటున్నాయి. అవి దయతలిస్తేనే రోడ్డుపై జనం సంచరించే పరిస్థితు లు ఉన్నాయంటే అబద్ధం కాదు. కుక్క కరవకుండా ఇంటికి చేరుకున్నామంటే అదృష్టంగానే భావించాల్సి వస్తోంది. ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.పిల్లలను బయటకు పంపడానికి తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు.రాజమండ్రి రైల్వేస్టేషనల్లో కుక్కలను తప్పించుకొని వెళ్లే కంగారులో ప్రమాదాలు జరుగు తున్నాయి.పిల్లల చేతిలో ఏమైనా తిను బండారాలు ఉంటే వాటిపైకి ఇసురుగా వచ్చి లాక్కోవడంతో పాటు పిల్లలపై దాడి చేయడానికి యత్నిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం కన్నెర్ర చేసే వరకూ పరిస్థితి వెళ్లింది.ఇప్పటికైనా భౌబోయ్ భయం తగ్గుతుందేమో అని జనం చర్చించుకుంటున్నారు.

- ఉమ్మడి జిల్లాలో లక్షకుపైనే గ్రామ సింహాలు
- పెరిగిపోతున్న కుక్కల సంతతి
- ఆసుపత్రులకు కుక్క కాటు బాధితుల క్యూ
- తూతూ మంత్రంగా ఏబీసీ ఆపరేషన్లు
- సుప్రీం కోర్టు ఆదేశించినా కానరాని కదలిక

పెంచేసిన..కరోనా

కరోనా విపత్తు 2019, 2020,2021, 2022లో ఏబీసీ ఆపేయడంతో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు.2023, 2024లో ఆ సంఖ్యను అదుపులోకి తీసుకురావడానికి సీరియస్‌గా యాక్షన్‌లోకి దిగలేదు. పంచాయతీల్లో ఏబీసీలు లేకపో వడంతో ఆయా ప్రాంతాల్లోని కుక్కలను తీసుకొచ్చి నగర శివార్లలో వదిలేస్తున్నారు. కుక్కలకు డిసెంబరు, జనవరి నెలల్లో బ్రీడింగ్ సమయం. ఒక్కో కుక్కకు ఒక ఈతలో 4 నుంచి 8 పిల్లలు పుడుతుంటాయి.



సుప్రీం ఆదేశాలు అమలయ్యేనా?

వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అలాగే ఏబీసీ తర్వాత మళ్లీ అదే ప్రాంతంలో వదలొద్దని ఆదేశించింది. కానీ ఈ రెండిటిపై కార్యాచరణ ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటి వరకూ జిల్లాలో కుక్కల షెల్టర్లు లేవు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఏబీసీ తర్వాత ఎక్కడ వదిలి పెట్టాలనే అంశం కూడా కీలకం కానుంది. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా ప్రాంగణాలు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, జన సమ్మర్ధ ప్రాం తాల్లో వీధి కుక్కల జాడ ఉండడానికి వీల్లేదని సుప్రీం చెప్పింది. విద్యా సంస్థల వద్ద కుక్కలు రాకుండా ఏర్పాట్లు ఉన్నా.. మిగతా చోట్ల నియం త్రించడంపై చిత్తశుద్ధి అవసరంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించడం చాలా కష్టమనే ప్రచారం సాగుతోంది. వీధికుక్కలను పట్టుకుని ఒక చోట చేర్చడం ఓ పెద్ద ప్రహసనమే అంటున్నారు. అన్ని కుక్కల ఆలనాపాలనా చూ డాలంటే తలకుమించిన భారమవుతోందని చెబుతు న్నారు.ఈ క్రమంలో సుప్రీం ఆదేశాలపై అధికారులు కార్యాచరణ రూపొందించాల్సి ఉంది.



ఏబీసీ పని చేస్తోందా!

కుక్కల సంఖ్య నియంత్రణకు యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) శస్త్రచికిత్సలు చేస్తుంటారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో రోజుకు ప్రస్తుతం 25 వరకూ ఏబీసీ చేస్తున్నామని చెబుతున్నారు.ఒక్కో కుక్కకు రూ.1500 చొప్పున కార్పొరేషన్ ఖర్చుచేస్తోంది. కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు రాజమహేంద్రవరం కార్పొ రేషన్‌కే పరిమితమైంది. దీని పైనా పర్యవేక్షణ లేదు..ఏ రోజు ఏం చేశారనే నిఘా లేదు. కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీల్లో పట్టిం చుకోవడం లేదు. పంచాయతీల్లో ఏబీసీ చేయ డానికి నిధుల కేటాయింపు లేదు.ఏబీసీ ఆప రేషన్ చేసినా కొన్నింటికి ఫెయిలవుతున్నాయనే వాదన ఉంది. కాకి నాడ,కోనసీమలో ప్రైవేటుగా చేయిస్తున్నట్టు సమాచారం.

వెటర్నరీ చతికిల

జిల్లా వ్యాప్తంగా వెటర్నరీ ఉన్న ఆస్పత్రుల్లో సర్జరీలకు పరికరాలు అందుబాటులో ఉంటాయి. వెటర్నరీ డిస్పెన్సరీలు ఉంటాయి. ఎక్కడా వెటర్నరీ శాఖ ఏబీసీపై దృష్టి సారించడం లేదు.దీంతో పంచాయతీల్లో కుక్కల సంతతి విపరీతంగా వృద్ధి చెందుతోంది. గతంలో కలెక్టర్ ఆదేశాలతో రాజమహేంద్రవరం వెటర్నరీ ఆస్పత్రిలో ప్రతి ఆదివారం వీధి కుక్కలకు ఏబీసీ చేసేవారు. నిలిపివేశారు ఎందుకో మరి..

తూర్పున 50 వేలు..

తూర్పుగోదావరి జిల్లాల్లో సుమారు 50 వేల గ్రామ సింహాలు ఉన్నట్టు అంచనా.రాజమహేంద్రవరం సిటీ పరిధిలోనే తక్కువలో తక్కువంటే 15 వేలు ఉంటాయి. శంభూనగర్‌లోనే కుక్కల సంఖ్య అధికం. అధికారులు మాత్రం బాగా తక్కువ చేసి చూపే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. రోజుకు కుక్కల నోటికి 100 మంది వరకూ చిక్కుతున్నారు. రాజమహేంద్రవరం సమగ్ర ప్రభుత్వ ఆస్పత్రికి రోజూ సుమారు 50 మంది కుక్క కాటు బాధితులు వస్తున్నారు.చికిత్స పొందుతున్న వాళ్లు మరో 50 మంది ఉంటున్నారు. ఈ లెక్కన రోజుకు 100కి పైగానే జనం కుక్కల బారిన పడుతున్నారు.

కాకినాడలో 37 వేలు

కాకినాడ జిల్లాలో 37 వేలు శునకాలు ఉన్నట్టు అంచనా. వాటిలో 15 వేలు కాకినాడ కార్పొరేషన్‌లోనే ఉన్నాయి.జిల్లాలో 2021లో కుక్క కాటు కేసులు 6031 నమోదు కాగా రేబిస్‌తో ఏడుగురు మృతిచెందారు. 2022లో 6364 కేసులు నమోదైతే ఆరుగురు మృతిచెందారు. 2023లో 4293 కేసులు నమోదైతే ఇద్దరు రేబిస్‌తో మృతి చెందారు.2024లో 5 వేల మంది, 2025లో 4 వేల మంది కుక్కకాటు బారిన పడ్డారు.కాకినాడ అధికారులు ఏబీసీ ఆపరేషన్లు ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా చేయిస్తున్నా సత్ఫలితాలనివ్వడంలేదనే ఆరోపణలున్నాయి.

కోనసీమలో 30 వేలు

కోనసీమ జిల్లాలో పెంపుడు,వీధికుక్కలు 30 వేలు ఉంటాయని చెబుతున్నారు. ఒక్క అమలాపురంలోనే 5 వేలుపైనే వీధి కుక్కలు ఉంటాయని సమాచారం..జిల్లాలోని పీహెచ్‌సీల్లో రోజుకు 40 మంది వరకు కుక్క కాటు బాధితులు వైద్యం చేయించుకుంటున్నారు. జిల్లాలో 4 వేల కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇచ్చారు. అమలాపురంలో కుక్కలను పట్టుకునేందుకు కాంట్రాక్టర్‌ను నియమించినట్టు కమిషనర్ నిర్మల్‌కుమార్ తెలిపారు.

నేడు అనపర్తికి స్పీకర్ అయ్యన్న రాక



అనపర్తి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం అనపర్తిలో పర్యటిస్తారని ఎమెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం అనపర్తి మండలం పెడపర్తి చేరుకుని గ్రామంలోని పురాతన శివాలయంలో జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారన్నారు. అనంతరం 12 గంటలకు కుతుకులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి అక్కడ రైతులతో ముచ్చటిస్తారన్నారు. అనంత రం 1గంటకు ఇటీవల అభివృద్ధి చేసిన అనపర్తి అర్తమూరు బీటీ రహదారిని స్పీకర్ ప్రారంభిస్తారన్నారు. స్పీకర్ పర్యటన విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కూటమి నాయకులకు పిలుపునిచ్చారు.



సింహాద్రి అప్పన్న



గెడ్డం సందీప్

రెండు కుటుంబాలకు.. గుండె కోత!

మృత్యువు ఏ రూపంలో ఎటు నుంచి వస్తుందో చెప్పలేం.. రెప్పపాటులో ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి.. చిన్నపాటి నిర్లక్ష్యం జీవితాలను బలి తీసుకుంటుంది.. గండేపల్లి మండలంలో ఆదివారం జరిగిన ఘటనే అందుకు నిదర్శనం.. జీవనోపాధి నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం నుంచి వరికోత మిషన్‌ను ఐషర్‌వ్యాన్‌పై తీసుకుని గండేపల్లి వెళ్లారు.. అయితే దారి మధ్యలో వరి కోత మిషన్ విద్యుత్ వైర్లకు తగిలి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు.

7


వరి పంట.. లేదు తంటా


53 కేంద్రాల్లో 3052.4 టన్నుల ధాన్యం కొనుగోలు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి.10 మండలాల్లో..53 రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్ప టి వరకూ జిల్లాలో 380 మంది రైతులకు చెందిన రూ.7.23 కోట్లు విలువైన 3052.4 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.95 మంది రైతు లకు సంబంధించిన 810.08 మెట్రిక్ టన్నులకు రూ.1.92 కోట్లు రైతుల ఖాతాలో జమచేశారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో కొంత పెండింగ్ ఉన్నట్టు అధి కారులు చెబుతున్నారు. సోమవారం మిగతా సొమ్ము జమ అవు తుంది.జిల్లావ్యాప్తంగా 19 మండలాల పరిధిలో 212 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా 53 కేంద్రాలు ఆరంభమయ్యాయి. రైతులు కోతలు ముమ్మ రం చేస్తే మిగతా కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. కాకినాడ జిల్లా 21 మండలాల పరిధిలో 269 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఒక మండలంలోనే 2 రైతు సేవాకేంద్రాల ద్వారా ఏడుగురు రైతుల నుంచి 44 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రం కొనుగోలు చేశారు. కోనసీమ జిల్లాలో కూడా పరిస్థితి ఇలానే ఉంది.కాకినాడ జిల్లా కంటే కొంత మెరుగు. ఇక్కడ 22 మండ లాల్లో 177 రైతుసేవా కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం రెండు మండలాల పరిధిలో 6 కొనుగోలు కేంద్రాల్లో 31 మంది రైతుల కు చెందిన 203.28 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. దాని విలువ రూ.48 లక్షలు. కానీ ఇంకా ఏమీ రైతుల ఖాతాలో జమ కాలేదు. ధాన్యం కొనుగోళ్లలో తూర్పు ముందు వరుసలో ఉంది.





నింగి నుంచి నిఘా!

నిర్మానుష ప్రదేశాల్లో డ్రోన్ కన్ను

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో పోలీసులు గట్టి నిఘానే కొనసాగిస్తున్నారు. జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నిఘాను డ్రోన్ల ద్వారా చేస్తున్నారు. అసాంఘిక శక్తుల ఆట కట్టించేందుకు జిల్లాలో ప్రశాంత వాతవరణం కల్పించేందుకు పోలీసులు డ్రోన్ల ద్వారా పలు ప్రాంతాలను తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. నిర్మానుష ప్రదేశాల్లో నిశితంగా పరిశీలన చేస్తున్నారు.ఆదివారం కార్తీక వన సమారాధనలు భారీగా ఉండడంతో బహిరంగ ప్రదేశాలు, తోటలు, గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిఘా పెట్టారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. డ్రోన్ కెమెరాలతో నేరాలు జరగకుండా పటిష్టమైన చర్యలను జిల్లా పోలీసులు చేపడుతున్నారు.

లక్ష్యం ఓకే.. బిల్లులు షాకే



గోకులం షెడ్లు బిల్లుల విడుదలలో తీవ్ర జాప్యం

గోకవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం గోకులం షెడ్లను మంజూరు చేసింది. పశుపోషకులు, కోళ్లు, జీవాల పెంపకందారులకు కొంతమేర రాయితీ కల్పిస్తూ ఒక్కో షెడ్డుకి రూ.1.80 లక్షల నుంచి రూ.2.30 లక్షల నిధులను తొలిసారి జరిగిన ఎంపికలో కేటాయించింది. ప్రస్తుతం కొత్తగా మంజూరు చేస్తున్న షెడ్లకు రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు కేటాయిస్తోంది. జిల్లా వ్యాప్తంగా లక్ష్యం మేరకు పాడి రైతులు అప్పులు తెచ్చి మరీ షెడ్లను నిర్మించారు. విడతల వారీగా బిల్లులు బకాయిలు చెల్లించాల్సి ఉండగా షెడ్లు పూర్తయి నెలలు దాటుతున్నా నిధుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుంది.కొంతమంది లబ్ధిదారులకు కొంతమేర మాత్రమే నిధులు మంజూరయ్యాయి. మిగిలిన బిల్లులకు పాడి రైతులు ఎదురు చూస్తున్నారు.

పాత బిల్లులకు ఎదురుచూపులు

జిల్లాలోని 18 మండలాల్లో సుమారు 675 గోకుల షెడ్లను నిర్మించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో 570 షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పాడి రైతులకు అనుకూల రీతిలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడం, బిల్లులు మంజూరులో జాప్యం జరుగుతుందనే ప్రచారం ఎక్కువుగా ఉండడంతో కొందరే నిర్మాణాలకు ముందుకు వచ్చారు. ఇప్పటి వరకు సుమారు రూ.7 కోట్లకు పైగా మేర నిధులు వచ్చాయి. ఇంకా సుమా రు రూ.కోటికి పైగా బిల్లులు పాత లబ్ధిదారులకు మంజూరు కావాల్సి ఉంది. నిర్మాణాలు పూర్తి చేసుకున్న మిగిలిన షెడ్లకు నిధులెప్పుడొస్తాయో.. సగం మాత్రమే మంజూరు చేసిన షెడ్లకు పెండింగ్ బిల్లులు ఎప్పుడు మంజూరు చేస్తారోనని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.తాజాగా మరో 900 షెడ్లు నిర్మాణాలు లక్ష్యం కాగా సుమారు 790 షెడ్లుకు మంజూరు లభించింది.



జాబ్‌మేళా పెట్టారు..ఉద్యోగాలిచ్చారు..

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళను వ్యాపారవేత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మెప్మా పీడీ టి.కనకరాజు అన్నారు. ఆనం కళాకేంద్రంలో ఆదివారం మెప్మా ఆధ్వర్యంలో నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు హాజరై మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యుల పిల్లలు భవిష్యత్ దృష్ట్యా సీఎం చంద్రబాబు జాబ్ మేళాలు,ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని చెప్పారు. పలు రంగాలకు చెందిన 18 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు. జాబ్‌మేళాలో మొత్తం 2165 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 645 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా 239 మందిని ఎంపికయ్యారని తెలిపారు. ఈ జాబ్ మేళలో ఆపరేషన్ మేనేజర్ ఎన్.కార్తీక్, యువత ,మహిళలు పాల్గొన్నారు.

శివయ్యకు జలాభిషేకం



కొవ్వూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లలితా పార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామికి కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు, మహిళలు గోష్పాదక్షేత్రంలోని గోదావరి నది నుంచి రాగి బిందెలతో నదీ జలాలను తీసుకుని ఊరేగించారు. శివాలయంలోని గర్భాలయం చుట్టూ గ్లాస్ డోర్‌లతో మూసివేసి గోదావరి నుంచి తీసుకువచ్చిన జలాలతో శివలింగం మునిగే వరకు అభిషేకం చేశారు. అనంతరం మహానీరాజనం సమర్పించారు. అనంతరం భక్తులకు కార్తీకమాసం సందర్భంగా అన్న ప్రసాద (అన్నదానం) వితరణ చేశారు.



కోట సత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మను ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూప హారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహా నివేదన చేశారు. భక్తులు అమ్మవారిని ప్రత్యేక, ఉచిత దర్శనం ద్వారా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు ఉన్నారు.

'తాడిపూడి పంట కాల్వ గండిని పూడ్చాలి'


పంట కాల్వకు ఏర్పడిన గండి

దేవరపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురం నుంచి దేవరపల్లి జాతీయ రహదారి వరకు ఉన్నరోడ్డు మధ్యలో తాడిపూడి పంట కాల్వకు గండి ఏర్పడి నీరు రోడ్డు పైకి చేరటంతో రోడ్డంతా ధ్వంసమవడంతో పొలాలకు వెళ్లే రైతులు, వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నట్టు లక్ష్మీపురానికి చెందిన దోనెల్లి మధుబాబు తెలిపారు. లక్ష్మీపురం, దేవరపల్లి మెయిన్‌రోడ్డుకు ఉన్న ఈ రహదారిని గతంలో కురిసిన వర్షాలకు పెద్దపెద్ద గోతులు పడితే క్వారీఅండ్ క్రషర్స్ సంఘం ఆధ్వర్యంలో రూ. 2 లక్షల 50 వేలతో రోడ్డును పూడ్చటం జరిగింది. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా నాగ భూషణశర్మ


బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం

కొవ్వూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడిగా రంఘావర్ఝుల నాగ భూషణశర్మ నియమితులయ్యారు. కొవ్వూరు ఆంధ్రా గీర్వాణ విద్యాపీఠంలో ఆదివారం బ్రాహ్మణ కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రంఘావర్ఝుల నాగ భూషణ శర్మ, ఉపాధ్యక్షుడిగా కప్పగంతుల ఫణీంద్ర, చర్ల ధర్మలింగశాస్త్రి, గజవల్లి నాగు, ప్రధాన కార్యదర్శిగా శనివారపు భరద్వాజ సాయి, కార్యదర్శులుగా ఆదిత్య, యశ్వంత్, రామకృష్ణ, తదితరులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా నాగ భూషణ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం, సంఘ పటిష్టతకు సభ్యుల సహకారంతో తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిఎస్వీ రమణమూర్తి, పులగుర్త శర్మ, అనుపిండి చక్రధరరావు, పిల్లమర్రి సర్వేశ్వరరావు, మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కురుకూరులో పంట కోత ప్రయోగం


పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయాశాఖాధికారులు

దేవరపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కురుకూరులో ఆదివారం వరిపంట కోతప్రయోగం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖాధికారి కే.కమలరాజు, డీఎస్‌వో జయభారతి మాట్లాడుతూ పంటకోత మొదటి ప్రయోగంలో పదమూడున్నర కేజీలు రావడం జరిగిందని, రెండో ప్రయోగంలో పది హేనున్నర కేజీలు దిగుబడి వచ్చిందని, దీని ద్వారా ఒక ఎకరానికి సుమారు 33 బస్తాలు దిగుబడి వస్తుందని అంచనా వేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఎస్‌వో అనిల్, దీపక్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధనలో మాజీ ఎమ్మెల్యే శేషారావు

పెరవలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కానూరులో శ్రీదేవిభూదేవి సమేత వల్లభ స్వామివారి ఆలయం నందు ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. దీనికి మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో సత్కరించారు.

శెట్టిబలిజలు ఏకమవ్వాలి

● వేమూలూరు కార్తీక వనసమారాధనలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్


కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

కొవ్వూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా శెట్టిబలిజలంతా ఏకం కావాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ఆదివారం వేమూలూరులో జరిగిన శెట్టిబలిజ కార్తీక వన సమారాధనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 3500 పైబడి యువతులకు ఉద్యోగాలు ఇప్పించగలిగామన్నారు. అలాగే పేద, మధ్య తరగతి ప్రజలను ఆదుకోవడమే తన లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుందన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్‌లో ఖచ్చితంగా నిధులు వేయడం జరుగుతుందన్నారు. ఆదరణ పథకం కింద పనిముట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కూడిపూడి సత్తిబాబు మాట్లాడుతూ శెట్టిబలిజలందరినీ ఒకే దగ్గరికి చేర్చడం అభినందించదగ్గ విషయమని, రాజ్యాధికారం వైపు వెళ్లడమే మనందరి లక్ష్యమన్నారు. 10 శాతం రిజర్వేషన్ ఇచ్చే మనల్ని ఆదరించిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక్క కూటమి ప్రభుత్వమేనన్నారు. సుమారు 400 మంది శెట్టిబలిజ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడంలో మంత్రి సుభాష్ కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధనలో ఎమ్మెల్యే ముప్పిడి


వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే

కొవ్వూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంగిడిలో ఆదివారం అరుంధతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం పలువురికి బహుమతులు, మెమెంటోలను అందజేశారు. యువజన సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.

'లోవ'లో భక్తుల రద్దీ

● రూ.2.43 లక్షల ఆదాయం

తుని రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.2.43 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

బ్రాహ్మణ గాయత్రి సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన

పెరవలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా ముక్కామలలో ఆదివారం బ్రాహ్మణ గాయత్రి సంఘం ఆధ్వర్యంలో శ్రీ ఉమా సోమేశ్వరస్వామి వారి ఆలయంలో లక్షపత్రి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వేకువజాము నుంచే పవిత్ర మారేడు దళాలతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు అర్చనలు జరిపారు. రాష్ట్రంలోని నలుమూలలో స్థిరపడిన ముక్కామలకు చెందిన బ్రాహ్మణ కుటుంబ సభ్యులు విచ్చేశారు. ముక్కామల గాయత్రి బ్రాహ్మణ సమాఖ్య గౌరవాధ్యక్షుడు వైద్య విద్వాన్ పీసపాటి రుక్మిణినాథ శాస్త్రి ఆధ్వర్యంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొని పండిత సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో కవికొండల పరబ్రహ్మమూర్తి, తుట్టగుంట అచ్యుతరామయ్య, పీసపాటి సుబ్రహ్మణ్యం, బాదంపూడి వెంకట సుబ్బారావు, తుట్టగుంట లక్ష్మీనారాయణ, బలుసు కామేశ్వరరావు, కొంపెల్ల లలిత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గొయ్యిని పూడ్చరూ..!

● వాహనదారుల ఇబ్బందులు


గొల్లగూడెం జాతీయ రహదారి మధ్యలో ఏర్పడిన పెద్ద గొయ్యి

దేవరపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి, తల్లాడ జాతీయ రహదారి గొల్లగూడెం వద్ద పెద్ద గొయ్యి ఏర్పడడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మలుపు వద్ద కావడంతో పలువురు అందులో పడి ప్రమాదాలకు గురైన సంఘట నలు ఉన్నాయి. అలాగే గతంలో చాలామంది మరణించినవారు ఉన్నారు. దీంతో ప్రస్తుతం పోలీస్ అధికారులు వేగనిరోధక బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ పెద్దగొయ్యి రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాలు తప్పించే మార్గం కూడా లేనందు వల్ల ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా రోడ్లు, భవనాల శాఖాధికారులు తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్తీక వన సమారాధనలు ఐక్యతకు నిదర్శనం : బూరుగుపల్లి


సమిశ్రగూడెంలో జరిగిన ఆర్య వైశ్య కార్తీక వన సమారాధనలో శేషారావు

నిడదవోలు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక వన సమారాధనలు సమాజంలో సత్సంబంధాలు పెంపొందేందుకు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఆదివారం సమిశ్రగూడెంలో జరిగిన ఆర్య వైశ్య కార్తీక వన సమారాధనలో పాల్గొని మాట్లాడుతూ నేటి బిజీ సమాజంలో కుటుంబాలతో అందరూ ఒకచోట కలిసి ఆటపాటలతో గడపడం గొప్ప విషయన్నారు. కార్యక్రమంలో వీరభద్రరావు, కొణిజేటి నాగేశ్వరరావు, ఆదిబాబు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

షిర్డీ సాయినాథుడి ఊరేగింపు


దేవరపల్లిలో ఊరేగిస్తున్న సాయి మాలధారులు

దేవరపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో షిరిడిసాయినాథుడ్ని ఆదివారం సాయంత్రం పురవీధుల్లో సాయినాథ దీక్షాదారులు ఊరేగిస్తూ భిక్షాటన చేశారు. 41 రోజులు దీక్ష చేసిన భక్తులు దేవరపల్లి రావిమెట్లకు చెందిన సాయినాథ దీక్షాదారులు దేవరపల్లి పురవీధుల్లో ప్రత్యేకవాహనంపై బాబావారిని ఊరేగించారు.

కరెంట్ స్తంభాలకు కట్టిన కేబుల్ వైర్లను వెంటనే తొలగించాలి

దేవరపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కేబుల్ ఆపరేటర్లందరూ కరెంటు స్తంభాలకు ఈ నెల 12వ తేదీన అలకు కట్టిన వైర్లను తొలగించాలని విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ సీహెచ్.వెంకట్రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేబుల్ వైర్లు విద్యుత్‌స్తంభాలకు కట్టడం ఆ కట్టిన వైర్ల వెంబడి వివిధ తీగజాతి మొక్కలు, పొదలతో విద్యుత్ సదుపాయానికి అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే కేబుల్ ఆపరేటర్లు తీగజాతి పొదులను, ముళ్ల పొదలను వెంటనే తొలగించాలన్నారు.

12న కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

కొవ్వూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 12వ తేదీన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం చేపట్టినట్టు మాజీఎమ్మెల్యే, నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ తలారి వెంకట్రావు తెలిపారు. కొవ్వూరు నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ సూపర్‌హిట్ అంటూ హడావుడి చేసిందన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్‌బాబు, ముదునూరి నాగరాజు, పరిమి సోమరాజు, కవల నాగేశ్వరరావు, చిట్టూరి అన్నవరం, ఏలూరి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన సత్యదేవుడి సన్నిధి

● భారీగా తరలివచ్చిన భక్తులు
● తొమ్మిది వేల వ్రతాలు
● రూ.85 లక్షల ఆదాయం



క్యూలో బారులు తీరి సత్యదేవుడి దర్శనానంతరం వస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం భక్తజనసందోహంగా మారింది. వేకువజామున 2గంటల నుంచి సర్వదర్శనాలు, వ్రతాలు ప్రారంభించగా సాయంత్రం 4 గంటల వరకు నిరంతరాయంగా రద్దీ కొనసాగింది. ఒక దశలో క్యూలైన్లు, వ్రత మండపాలు కిక్కిరిసి నిండిపోవడంతో అధికారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్ప డింది. వాహనాల పార్కి ంగ్‌తో గందరగోళ పరిస్థితులు రావడంతో ఎస్‌ఐ హరిబాబు కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలను కొండ దిగువ కళాశాల మైదానంలో పార్కింగ్ చేయించి కొండదిగువ నుంచి ఉచిత బస్సుసౌకర్యం కల్పించారు. సుమారు 90వేలమందిని స్వామిని దర్శించుకోగా సత్యదేవ నిత్యాన్నదాన పథకం ద్వారా 25వేలమందికి ఉచిత పులిహోర పంపిణీ చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 2 గంటలు, ఉచిత దర్శనానికి 3గంటల సమయం భక్తులు వేచిఉండాల్సి వచ్చింది. చైర్మన్ రోహిత్ దగ్గరుండి ఎటువంటి తోపులాటలు జరగకుండా పర్యవేక్షించారు. ఆదివారం ఒక్కరోజు 9వేల జంటలు సత్యదేవుడి వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షలు ఆదాయం లభించింది. భక్తుల రద్దీతో అంత్రాలయం దర్శనం టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేసి శీఘ్రదర్శనానికి పరిమితం చేశారు. దిగువభాగంలో ఉన్న యంత్రాలయం సాయంత్రం వరకు పూర్తిగా నిలిపివేశారు. ఈవో సుబ్బారావు సత్యగిరికొండ, వ్రత మండపాలలో తిరుగుతూ కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించారు. కాగా రత్నగిరిపై కార్తీక సోమవారం జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ఆదివారం రాత్రి భారీ సంఖ్యలో భక్తులు చేరుకున్నారు. వసతి గదులు సరిపడక ఆరుబయట విశ్రమించారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

● పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంకర్ అన్‌లోడు చేస్తుండగా మంటలు
● అదుపు చేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది



పెట్రోల్ బంక్‌లో ఆయిల్ ట్యాంకర్ వద్ద చెలరేగుతున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్ సమీపంలోని భారత పెట్రోల్ బంక్‌లో తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఆదివారం పెట్రోల్ బంక్‌లోకి వెళ్లిన ఆయిల్‌ట్యాంకర్ నుంచి అండర్‌గ్రౌండ్‌లో ఉన్న ట్యాంకర్‌లోకి పెట్రోల్‌ను అన్‌లోడు చేస్తుండగా సిబ్బంది నిర్లక్ష్యం వల్ల మంటలు చెలరేగాయి. దీంతో అక్కడి సిబ్బందితో పాటు పెట్రోల్ కోసం వచ్చిన వాహనదారులు పరుగులు తీశారు. దీంతో భయానక వాతవరణం ఏర్పడింది. ఒకరిద్దరు సిబ్బందిని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. బంక్ నిర్వాహకుల సమాచారంతో ఆర్యాపురం అగ్నిమాపక శాఖ ఫైరింజన్ సకాలంలో బంక్ వద్దకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఏ మాత్రం ఆలస్యమైనా పెనుప్రమాదం జరిగి భూగర్భంలో ఉన్న ఆయిల్‌ట్యాంక్‌లు పేలి చుట్టుపక్కల ప్రాంతాలు, వ్యాపార సంస్థలు తునాతునకలై ప్రాణనష్టం జరిగిఉండేది. ప్రమాదం తప్పి పెద్దగా ఆస్తినష్టం జరగలేదు.

వెంకన్న ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

వాడపల్లిలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పూజలు


వెంకన్న ఆలయంలో అయ్యన్నపాత్రుడికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచి కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న శ్రీదేవి భూదేవి సమేత వాడపలి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించుకున్నారు. అర్చక బృందం పూర్ణకుంభంతో మేళతాళ మంగళవాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ నిర్వహించుకుని స్వామిని దర్శించుకున్నారు. వసంత మండపంలో వేద పండితుల ఆశీర్వచనం స్పీకర్ దంపతులతో పాటు కుటుంబ సభ్యులు అందుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్య చంద్రరావు స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం సమర్పించారు. అనంతరం విలేకర్లతో స్పీకర్ మాట్లాడుతూ స్వామివారు ఎంతో ప్రాచూర్యం పొందారని, కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ఖ్యాతిని అర్జించనడంతో దేశ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారన్నారు. తాను సామాన్య భక్తుడిలానే కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించుకున్నానన్నారు. క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని, మరింత అభివృద్ధికి సహకారం అందిస్తానని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని, దీనికి అనుగుణంగా మహిళలతో ఆలయాల్లో రద్దీ పెరిగిందని మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే బండారు తనయుడు బండారు సంజీవ్, టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచ్ కాయల జగన్నాథం, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎస్‌ఐ రాము, నాయకులు ఉన్నారు.

గోదావరిలో స్నానానికి దిగి పదోతరగతి విద్యార్థి మృతి

కపిలేశ్వరపురం/ అంబాజీపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక వద్ద ఆదివారం గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు యువకుడు మృతిచెందాడు. అంగర ఎస్‌ఐ హరీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన నామాడి బన్ను (15) కేదార్లంక శివారు వీధివారిలంక ధనమ్మ మర్రి వద్దకు స్నేహితులతో కలిసి వచ్చాడు. అనంతరం గోదావరి నదిలో స్నానానికి ముగ్గురు స్నేహితులతో కలిసి దిగాడు. వారిలో బన్ను గల్లంతయ్యాడు. మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. విహారయాత్రకు వెళ్లిన బన్ను(15) గోదావరిలో మృతిచెందడంతో పుల్లేటికుర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. బన్ను పుల్లేటికుర్రు జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అతడి తండ్రి అబ్రహం ఆటో డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బన్ను పెద్ద కుమారుడు కాగా చిన్న కుమారుడు అభిషేక్ ఆరో తరగతి చదువుతున్నాడు.

వరి కోత పనులకు వచ్చి...

● విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి ● వరి కోత మిషన్ తరలిస్తుండగా ఘటన


మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ



సందీప్, సింహాద్రి (ఫైల్)

గండేపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం రామయ్యమ్మపాలెం నుంచి సింగరంపాలెనికి ఆదివారం ఉదయం వరి కోత మిషన్‌ను ఐషర్ వ్యాన్ మీద తీసుకెళ్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఐషర్ వ్యాన్ పై వరి కోత మిషన్‌ను తరలిస్తుండగా దారి మధ్యలో 11కెవి విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ గెడ్డం సందీప్ (20) షాక్‌తో మృతిచెం దాడు. ముందు బండి మీద వెళుతున్న మిషన్ యజమాని కరిపెట్టి సింహాద్రి అప్పన్న (53) వెనక్కి వచ్చి ఏ మయిందోనని ఆందోళనతో వ్యాన్‌ను ముట్టుకోగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతిచెందిన ఇద్దరు పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు, రాపాక గ్రామా లకు చెందినవారు. వరి కోత పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చినట్టు పోలీసులు తెలిపారు. డ్రైవర్ ఎడమ వైపునకు రావడంతో మిషన్ పైన గొట్టం విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ సరఫరా అయి నట్టు తెలిపారు. మృతదేహాలను అంబు లెన్స్‌లో మార్చురీకి తరలించామన్నారు. రైతుల మోటార్లకు త్రి ఫేస్ విద్యుత్తు సరఫరా ఉండడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందన్నారు. సీఐ శ్రీని వాస్, ఎస్ఐ శివ నాగబాబు సంఘట నా ప్రాంతాన్ని పరిశీలించారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

లైట్లు వెలగవు ... చీకట్లు తొలగవు


ఎల్‌ఈడీ లైట్లకు మరమ్మతులు చేస్తున్న స్థానికులు

గోపాలపురం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆ లైట్లు వెలగవు.. చీకట్లు తొలగవు. మండల కేంద్రంలో గల జాతీయ రహదారి నాలుగు రోడ్ల ప్రధాన కూడలిలో అంధకారం ఏర్పడడంతో గ్రామస్థులు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే నియోజక వర్గ కేంద్రమైన గోపాలపురంలో చెక్‌పోస్టు సెంటర్ నుంచి దుర్గాంబిక టౌన్ షిప్ వరకు జాతీయ రహదారి 516డీ పై నిర్మాణ సమయంలో రెండు ప్రధాన సెంట ర్లలోని నాలుగు రోడ్ల కూడలిలో ఎల్‌ఈడీ లైట్లు అమర్చారు. అయితే ఇవి ప్రస్తుతం వెలగకపోవడంతో దుర్గాంబిక టౌన్‌షిప్ వద్ద అంధకారం ఏర్పడుతోంది. ఇకనైనా అధికారులు తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.